RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

8మంది కార్మికులు మృతి



విశాఖపట్నం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం మిగతా 2లో..

సంపుటి :24 Vol. No.24 సంచిక : 161 Issue No. 161 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: మంగళవారం 09-06-2026 Tuesday, June 09 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## 10న ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సిఎం, డిప్యూటి సిఎంల భేటీ

నేడు ఢిల్లీకి వెళ్లనున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్





**అమరావతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జూన్ 10వ తేదీన నిర్వహించనున్న ఎన్డీఏ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో వీరు పాల్గొన నున్నారు. మోదీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు హాజరుకానుండగా, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాలతో సమన్వయం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. దేవిధంగా, త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల పాత్ర, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు, రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలపై కూడా చర్చలు జరగవచ్చని సమాచారం. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలక అంశాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర సహాయ నిధులు, పెండింగ్‌లో ఉన్న విభజన హామీలపై సీఎం చంద్రబాబు కేంద్ర నాయకత్వంతో చర్చించే అవకాశం ఉంది.




# ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

- భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీ
- క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ
- ట్యాంపర్ చేయకుండా పకడ్బందీగా భూ రికార్డులు
- గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారు
- గొడ్డలి పట్టే వారికి నాగలి పట్టే వారి బాధలు ఎలా తెలుస్తాయి
- ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నాం
- సిద్ధాంతంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ
- సాగు,తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్న సీఎం చంద్రబాబు

**భీమవరం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని అన్నారు. సోమవారం సిద్దాంతంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో తాగు నీరు, సాగునీరుకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునే బాధ్యతను మంత్రి రామానాయుడికి అప్పగించామన్నారు. ఎప్పుడు చూసినా గోదావరి జిల్లా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పంటలు పండించడంలో జిల్లాలో రైతులకు మించిన వారు లేరని కొనియాడారు. రాయలసీమ, విశాఖ జిల్లాల్లో పరిశ్రమల కోసం భూములు కావాలంటే ఇస్తారని.. ఇక్కడ మాత్రం సెంటు భూమి కూడా ఇవ్వరని అన్నారు. అక్వా రైతుల సంక్షేమం కోసం ఓ ప్రణాళిక రూపొందించనున్నట్లు మిగతా 2లో..

## మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు... రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

ఇండియా కూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖరే




**న్యూఢిల్లీ, జూన్ 8 (ఆర్ఎన్ఎ):** ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళన కరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు మిగతా 2లో..

## సిగరెట్‌లా.. సమాజానికి వైసిపి తీవ్ర హానికరం

- ఈ విషయాన్ని కూటమి నేతలు రోజూ చెప్పాల్సిందే
- నంద్యాల పర్యటనలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



**నంద్యాల, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సిగరెట్ తాగడం ఎంత హానికరమో.. సమాజానికి వైసీపీ అంతకంటే హానికరమని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చరించారు. ఈ మిగతా 2లో..

## టీఎంసీ కి మరో ఎదురుదెబ్బ

రాజ్యసభ ఎంపి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా





**కోల్‌కతా, జూన్ 8 (ఆర్ఎన్ఎ):** టీఎంసీ కి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం మిగతా 2లో..

## పరీక్షలంటే తెలియని వారు విమర్శలా

విద్యార్థులకు జగన్ క్షమాపణలు చెప్పాలి... ఇక్కడ చాలదన్నట్లు తెలంగాణలోనూ భూ కబ్జాలు

జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు



**భీమవరం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నా దగ్గర తోక జాడిస్తే చూస్తూ ఊరుకోను. నేను సీఎంగా ఉన్నంతవరకు ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టనని సిఎం చంద్రబాబు హెచ్చరించారు. సిద్ధాంతంలో పట్టాదారు పుస్తకాల జారీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీవి అన్నీ తప్పుడు ప్రచారాలే. నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర వైసీపీది. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాకే జగన్ రాజకీయాలు చేసుకోవాలని హెచ్చరించారు. వివేకాను చంపి.. నా చేతిలో గొడ్డలి పెట్టారు. జగన్ వంటివారికి ఎప్పటికప్పుడు బుద్ధి చెప్పాలి. పరీక్షలు అంటే మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయిలు

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్‌ఎంఎస్–2, ఎస్‌టీసీ–3 హీట్ ఎఫ్‌జీలో భారీ మొత్తంలో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఉక్కు ద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అగ్నిపమాక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు.

## మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్‌ఎమ్‌ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

## టీఎంసీ కి మరో ఎదురుదెబ్బ

ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఢిల్లీలో నేడు జరగనున్న ఇండియా కూటమి కీలక భేటీలో పాల్గొనడానికి మమత దేశ రాజధానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

## పరీక్షలంటే తెలియని వారు విమర్శలా

తెలియనివాళ్లు విమర్శలు చేస్తున్నారని అంటూ సీఎం దుయ్యబట్టారు. తెలంగాణలోనూ వైసీపీ నేతలు భూములను కాజేయాలని చూశారని సీఎం తెలిపారు. ఇక్కడ చాలదన్నట్లు.. తెలంగాణలోనూ కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. కోడికత్తి డ్రామాలు చేసేవారికి రైతుల బాధలు తెలియవన్నారు. తిరుమల దేవదేవుడి అంశంలోనూ ద్రోహం చేశారని మండిపడ్డారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని అపవిత్రం చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే దుర్మార్గులను దూరం పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. ఒక్క పరిశ్రమ రాలేదని.. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డులు తారుమారు కావడం వల్ల అనేక వివాదాలు తలెత్తాయి. ఒకప్పుడు బ్రిటిష్ కాలం నుంచి కొనసాగిన పటిష్టమైన భూ రికార్డుల వ్యవస్థ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యలు తక్కువగా ఉండేవి. కానీ గత పాలకుల నిర్వాకంతో భూ యాజమాన్య సమస్యలు పెరిగిపోయాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట తీసుకొచ్చిన చట్టం రైతుల భూములపై అనిశ్చితి సృష్టించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసి రైతుల యాజమాన్య హక్కులను కాపాడామని వివరించారు.

## హర్మూజ్ వద్ద బారత ప్రయాణికుల నౌకపై దాడి

### దాడిలో తీవ్రంఆ దెబ్బతిన్న ఇంజన్

**న్యూఢిల్లీ,జూన్8(ఆర్‌ఎన్‌ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ, భారతీయులు ప్రయాణిస్తున్న ఓ కార్గో నౌక దాడికి గురైనట్టు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఈ దాడి జరగ్గా.. ఆ సమయంలో నౌకలో 24 మంది భారతీయులున్నారని సమాచారం. దీంతో అత్యవసర సహాయం కోసం నౌకలోని సిబ్బంది అభ్యర్థించినట్టు వార్తలు వస్తున్నాయి. పలావు దేశ జెండాతో వెళ్తున్న నౌక ఒమన్ తీరానికి దగ్గర్లో ఉన్న సమయంలో ఈ దాడి జరినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఆ నౌకలో 24 మంది భారతీయులున్నట్టు సమాచారం. ఈ దాడి కారణంగా నౌక ఇంజిన్ దెబ్బతిందని, నౌకకు రంధ్రం పడిందని, దాంతో సిబ్బంది ఎస్‌ఓఎస్ కాల్ పంపినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ దాడి కారణంగా నౌకలోని లైఫ్ బోట్లు కూడా దెబ్బతిన్నట్టు సమాచారం. దాడి కారణంగా ఆ ఓడలో పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. లైఫ్‌బోట్లు కూడా దెబ్బతినడంతో తరలింపు ప్రక్రియ సంక్లిష్టంగా మారినట్టు సమాచారం. కాగా, నౌకపై క్షిపణులు లేదా డ్రోన్‌లతో దాడి జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ దాడికి బాధ్యులు ఎవరనే విషయంలో స్పష్టత లేదు. ఈ దాడికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

# ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి తెలిపారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారని.. గొడవలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిందని మండిపడ్డారు. గొడ్డలి పట్టుకునే వారికి నాగలి పట్టుకున్న రైతు గుర్తుకు రాలేదని వ్యాఖ్యానించారు. 'మీ భూమి మీద సైకో ఫొటో వేశారు. భూమి మీది.. ఫొటో సైకోది.. నిద్ర లేస్తూనే ఆయన మొహం చూడాల్సి వచ్చేది. జగన్ పిచ్చితనానికి ట్రీట్‌మెంట్ ఎక్కడ ఉందో తెలీదు. మీకేమైనా తెలిస్తే, ఆ అడ్రస్ ఆయనకు పంపుతాను' అంటూ సీఎం చంద్రబాబు సెటైరికల్ కామెంట్స్ చేశారు. రీసర్వేలో రైతులను భాగస్వాములను చేశామని చెప్పారు. 6,688 గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూ రికార్డులు అప్‌డేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 26 లక్షల పాస్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. నిషేధిత జాబితా 22ఎలో ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో రూ.8వేల కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని చంద్రబాబు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. త్వరలో ఆక్వా రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో భూ రికార్డుల సంస్కరణలు, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి జిల్లాలు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా నిలిచాయని కొనియాడిన సీఎం.. ఈ ప్రాంత రైతులు భూమిని సమర్థంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని, భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం సీఎం చెప్పుకొచ్చారు. భూమి రికార్డులను మరింత భద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌లు, అధునాతన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నాము. కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ప్రమాణాల తరహాలో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు అందిస్తున్నాము. రీ–సర్వే, ఈ–కేవైసీ ప్రక్రియల అనంతరం మాత్రమే పాస్



పుస్తకాలు ముద్రిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ–సర్వే పూర్తి చేసి 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసాము. ఇంకా 62.32 లక్షల పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా 90 లక్షల మంది భూ యజమానులకు పాస్ పుస్తకాలు అందజేయడమే లక్ష్యం. గత పాలనలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు మూడు సంవత్సరాల పాటు కృషి చేయాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్నాము. రీ–సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేసాం. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల భూ లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ వ్యవస్థను అమలు చేస్తున్నాము. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేస్తూ రూ.10 లక్షల లోపు ఆస్తులకు కేవలం రూ.100తో బదిలీ సౌకర్యం కల్పించాము. అంతకంటే ఎక్కువ విలువ గల ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది' అని సీఎం చెప్పారు. అలాగే పాత భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని.. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ రికార్డులను డిజిటల్ రూపంలోకి తీసుకువస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని, 15 జిల్లాల్లోని 33,012 ఎకరాల షరతు గల పట్టా భూములపై ఆంక్షలను కూడా ఎత్తివేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోందని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల్లో 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు జమ చేశామని, కేంద్ర ప్రభుత్వ సహాయంతో కలిపి ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు రావడానికి నెలల తరబడి పట్టేదని, ప్రస్తుతం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువలు, చెరువుల మరమ్మతులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆక్వా చెరువులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, దాణా ధరలు పెరగడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. ఆక్వా రంగం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలకు కీలకమని పేర్కొన్న సీఎం, ఆ రంగానికి అన్ని విధాలా మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను వినియోగించి న్యూట్రాస్యూటికల్ ఔషధాల తయారీకి అవకాశాలు ఉన్నాయని కూడా సూచించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# సిగరెట్‌లా.. సమాజానికి వైసిపి తీవ్ర హానికరం

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని ప్రతిరోజూ కూటమి నేతలు ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేశవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రత్యర్థి ప్రజాస్వామ్యవాది కాదని.. అధికారం కోసం ఎన్ని అడ్డదార్లయినా తొక్కేందుకు సిద్ధపడతారని ఎద్దేవా చేశారు. సోమవారం నంద్యాల జిల్లాలో మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ లైన్ దాటి అధికారాన్ని ఉపయోగించరని, కానీ జగన్ రెడ్డి రోజూ లైన్ దాటుతారని చెప్పారు. ఏపీలో జగన్ అరాచక పాలన మళ్లీ రాకూడదంటే.. 'గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, కూటమి అగైన్ అండ్ అగైన్' అని చాటి చెప్పాలని మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చిన 93శాతం స్ట్రైక్ రేటుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని వ్యాఖ్యానించారు. నాడు పోలింగ్ బూత్ స్థాయిలో వెనకడుగు వేయకుండా జెండా పట్టుకుని నిలబడిన ప్రతి కార్యకర్త శ్రమ, ధైర్యమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. కార్యకర్తల త్యాగాలను మరిచిపోతే ఏ రాజకీయ నాయకుడు, ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాగించలేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలవబోయే నాయకులందరి కోసం తాము కష్టపడాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గ్రూపు రాజకీయాలు కడితే పతనం తప్పదని మంత్రి పయ్యావుల హెచ్చరించారు. కార్యకర్తలు, నేతలు అలకలు వీడాలని అన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అలిగి పార్టీకి దూరమవ్వద్దని చెప్పారు. కొట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. రాయలసీమ రాజకీయాల్లో అప్రమత్తత అవసరమని తెలిపారు. గొడ్డలి పార్టీపై నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మనం ప్రభుత్వంలో ఉన్నామని నిద్రపోవద్దని చెప్పారు. టీడీపీ శ్రేణులు ఓటర్ లిస్ట్‌పై పట్టు సాధించాలని దిశానిర్దేశర చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయి..

– సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణం – అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలి

– నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవు – జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయని.. సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణమన్న విషయాన్ని గుర్తించి అధికారులు ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా స్నేహపూర్వక పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జరిగింది. అంతకుముందు కలెక్టర్ లక్ష్మీశ శాఖల వారీగా అర్జీల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంతవరకు ఎన్ని అర్జీలు అందాయి? ఎన్ని పరిష్కరించారు? పరిష్కార నాణ్యత.. తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత ప్రజాస్నేహపూర్వకంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం జిల్లాస్థాయి అధికారులు స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి, సమస్య పరిష్కారంపై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కార నాణ్యతపై పూర్తి బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులను స్వీకరించే సమయంలోనూ, పరిష్కరించే ప్రక్రియలోనూ అధికారులు నిబద్ధత, సహానుభూతితో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా సేవలు అందించడమే ప్రతి అధికారి ప్రధాన బాధ్యతగా భావించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

**జిల్లాస్థాయి కార్యక్రమానికి 151 అర్జీలు:** ప్రజా స్నేహపూర్వక పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 151 అర్జీలు రాగా.. వీటిలో పురపాలన, పట్టణాభివృద్ధి శాఖకు 33, రెవెన్యూకు 29, పంచాయతీరాజ్‌కు 17, పోలీసు శాఖకు 14 అర్జీలు వచ్చాయి. అదే విధంగా ఏపీఎన్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్‌కు 9 అర్జీలు రాగా విద్య, ఆరోగ్యం, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు ఆరు చొప్పున అర్జీలు వచ్చాయి. విద్యుత్, డీఆర్‌డీఏ, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు నాలుగు చొప్పున , పౌర సరఫరాలు 3, ఏపీఎస్ ఆర్‌టీసీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, రహదారులు–భవనాల శాఖలకు రెండు చొప్పున అర్జీలు అందాయి. బీసీ సంక్షేమం, సహకార, డ్వామా, ఎండోమెంట్, గృహ నిర్మాణం, ఇరిగేషన్, ఎల్‌డీఎం, ఆర్‌ఐవో, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిపెట్టి నిర్దేశ గడువులోగా నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, పీజీఆర్‌ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎపిలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

### ఈదురుగాలులు వీచే అవకాశం

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**అమరావతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో మంగళవారం అక్కడక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సోమవారం వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాల సూచన ఉందని తెలిపింది. ఇక కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో పాటు వర్షాలు పడతాయని తెలిపింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వైఎస్సార్ కడప జిల్లాలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాల కురుస్తాయని సూచించింది. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడ వద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే భారీ హోర్డింగ్స్ ప్రాంతాల్లో ఉండ వద్దని ప్రజలకు తెలిపింది. ల్గ÷తులు, పశువుల కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు వినిపించగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని స్పష్టం చేసింది. తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో 42 – 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎండ తీవ్రత కొనసాగనుందని తెలిపింది. పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 40 – 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నెలకొంటాయని చెప్పింది. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత కొనసాగనుందని విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. అయితే సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరులో 41.7 డిగ్రీలు, చిట్యాలలో 41.4 డిగ్రీలు, ఎస్. రాయవరంలో 41.2 డిగ్రీలు, పెదపారుపూడిలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయిందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

### ఇరాన్‌ను వీడాలని భారత్ అడ్వైజరీ

న్యూఢిల్లీ,జూన్8(ఆర్‌ఎన్‌ఎ): ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. టెహ్రాన్‌కు చెందిన మషహర్ పెట్రోకెమికల్ ఎ÷–లాంట్‌పై దాడి చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ప్లాంట్ తీవ్రంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. నైరుతి ఇరాన్‌లో పెట్రో కెమికల్స్ ఎగుమతుల్లో మషహర్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైనది.

## చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలు

### ఎపికి తరలిస్తున్న 9 లారీల సీజ్

**హైదరాబాద్, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చేపలకు ఆహారంగా ఉపయోగించేందుకు తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు నగరంలో హెచ్ ఫాస్ట్ పోలీసుల బృందం భారీ ఆపరేషన్ చేపట్టింది. చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న 9 లారీలను సీజ్ చేసింది. 120 టన్నుల వ్యర్థాలను స్వాధీనం చేసుకుంది. ఆ వ్యర్థాలను చెరువుల్లో చేపలకు ఆహారంగా వాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని రెండరింగ్ ప్లాంట్‌కు పంపాల్సిన వ్యర్థాలను మళ్లించి ఏపీలోని గుంటూరు, వినుకొండ, అద్దంకి, భీమవరంలోని చెరువులకు వీటిని తరలిస్తున్నట్లు సమాచారం. జీహెచ్‌ఎంసీ పరిధిలోని రెండరింగ్ ఎ÷–లాంట్‌కు పంపాల్సిన వ్యర్థాలను దారి మళ్లించినట్లు గుర్తించారు. చికెన్ వ్యర్థాలు తిన్న చేపలను మనుషులు తింటే ఆరోగ్యానికి ప్రమాదకరమని పోలీసులు తెలిపారు.


Truhome FINANCE

DEMAND NOTICE

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోర్ నం.5, పాత నం.11, 2వ లేన్, సెనోటాఫ్ రోడ్, అల్వార్ పేట , తేనాంపేట, చెన్నై – 600018

హెడ్ ఆఫీస్: లెవెల్ 3, వోక్హార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్ C-2 బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబై – 400051 వెబ్‌సైట్: www.truhomefinance.in

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) నుండి పొందిన రుణ సౌకర్యాల అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో ఈ క్రింది రుణగ్రహీతలు విఫలమ అయ్యారని మరియు పేర్కొన్న రుణ ఖాతాలను నిరర్థక ఆస్తులు (NPA)గా వర్గీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. సెక్యూరిటైజేషన్ మరియు రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI ACT)లోని సెక్షన్ 13(2) కింద వారికి డిమాండ్ నోటీసు జారీ చేయబడింది, వారి చివరి చిరునామాలో. పేర్కొన్న డిమాండ్ నోటీసుతో పాటు, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయబడు తున్నది.
సెక్షన్ 13(2) కింద పంపిన రుణగ్రహీతలు, సెక్యూరిటీలు, బకాయిలు, డిమాండ్ నోటీసుల వివరాలు మరియు అక్కడ క్లెయిమ్ చేయబడిన మొత్తం కింద ఇవ్వబడ్డాయి-

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ పేరు & చిరునామా | సురక్షిత ఆస్తుల ఆస్తి చిరునామా | డిమాండ్ నోటీసు తేదీ & బకాయి మొత్తం రూ. |
| --- | --- | --- |
| 1. శ్రీ మేకతోటి శివాజీ గారు, S/O శ్రీ హనుమంతరావు గారు<br>2. శ్రీమతి ప్రతిపాటి రమణమ్మ గారు, W/O శ్రీ మేకతోటి శివాజీ గారు<br>చిరునామా:<br>డోర్ నెం. 10-151, రాజీవ్ గాంధీ కాలనీ, గణపవరం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, భారతదేశం – 522619.<br><br>రుణ మొత్తం: రూ. 7,69,927/-<br>ఎన్‌పీఏ (NPA) తేదీ: 04-12-2025<br>ఖాతా నంబర్: SMLHGUNT0001349 | 91.66 చదరపు గజాల విస్తీర్ణం గల ఆస్తి, ఇంటి నెం 10-151/1 కలిగి ఉంది. ఇది చిలకలూరిపేట ఉప-రిజిస్ట్రేషన్ జిల్లాలోని గణపవరం గ్రామంలో ఉన్న సర్వే నెం 191/C2లో ఉంది, ACC షీట్ బిల్డింగ్, అసెస్మెంట్: 4409, మరియు ACC: 240 చదరపు అడుగులు, దీనికి సరిహద్దులు:<br>పశ్చిమాన: క్లెయిమర్ (మేకతోటి శివాజీ) ఆస్తి. 33.0", ఉత్తరాన: పంచాయతీ బజార్. 25.0", దక్షిణాన: పంచాయతీ బజార్, 25'.0", తూర్పున: గుంటనాల మన్నియాయ్య స్థలం. 33'.0"<br>అంశం-II- 91.66 చదరపు గజాల విస్తీర్ణం గల ఆస్తి... చిలకలూరిపేట ఉప-రిజిస్ట్రేషన్ జిల్లాలోని గణపవరం గ్రామంలో ఉన్న, సర్వే నంబర్ 191/C లోని, ACC షీట్ బిల్డింగ్ పరిధిలో గల, 10-151 నంబర్ గల ఇంటి స్థలం. దీనికి పశ్చిమాన: అడపాల నారాయణ ఇల్లు 33 అడుగులు<br>ఉత్తరాన: పంచాయతీ బజార్ 25 అడుగులు<br>దక్షిణాన: బజార్ 25 అడుగులు , తూర్పున: నారగయపాలెం తిరుపతిరావు స్థలం 33 అడుగులు సరిహద్దులుగా ఉన్నాయి.<br>చిలకలూరిపేట ఉప-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది. | డిమాండ్ నోటీసు తేదీ - 15-12-2025<br><br>డిమాండ్ నోటీసు మొత్తం రూ.900670/-(తొమ్మిది లక్షల ఆరు వందల డెబ్బై మాత్రమే) 31-12-2025 నాటికి<br><br>లోన్ ఖాతా నెం. SMLHGUNT0001349 |

మీరు రుణగ్రహీతలుగా, పై పేర్కొన్న బకాయి మొత్తాన్ని ఈ నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 రోజుల లోపు పూర్తిగా చెల్లించవలసిందిగా దీనివల్ల ఆదేశించబడుచున్నారు. చెల్లింపుదాకా కలిగే వడ్డీ మరియు జరిమానా వడ్డీతో సహా మొత్తం బకాయిని చెల్లించాలి. అలా చేయని పక్షంలో, సదరు భద్రతలను అమలు చేయుటకు SARFAESI ACT ప్రకారం తగిన చర్యలు తీసుకోవలసి ఉంటుందని తెలియజేయబడుచున్నది. అదేవిధంగా, ఆ చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, మా సమ్మతి లేకుండా పై పేర్కొన్న భద్రతలను అమ్మకం, లీజ్ లేదా ఇతర మార్గాలలో బదిలీ చేయరాదని మీకు తెలియజేయబడుచున్నది.

స్థలం: గుంటూరు
తేదీ : 09.06.2026

సం /- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా!

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

# నీట్ రీ ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### పేపర్ తయారీ నుంచి, ప్రింటింగ్ వరకు సీక్రసీ.... పేపర్ తయారీదారులంతా రహస్య ప్రదేశానికి తరలింపు




**న్యూఢిల్లీ,జూన్8(ఆర్ఎన్ఎ):** మే 3న జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించబోయే రీ టెస్ట్‌ను అత్యంత పారదర్శకంగా, లీకులకు ఏమాత్రం తావులేకుండా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మునుపెన్నడూ లేని విధంగా ఒక అసాధారణ భద్రతా వ్యూహాన్ని సిద్ధం చేశాయి. ఈసారి క్వశ్చన్ పేపర్లు లీక్ అవ్వకుండా ఉండేందుకు ఏకంగా భారత వైమానిక దళం సహాయం తీసుకోనున్నారు. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మధ్య జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఈ వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో క్వశ్చన్ పేపర్లను ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించే రవాణా సమయంలోనే లీకేజీ ముఠాలు చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి.. ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణలో సరికొత్త చర్యలు చేపడుతున్నారు. దీని ప్రకారం.. క్వశ్చన్ పేపర్లను అత్యంత సురక్షితమైన ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. దీనివల్ల రవాణాలో జరిగే ఆలస్యం తగ్గడమే కాకుండా.. అనధికారిక వ్యక్తులు క్వశ్చన్ పేపర్లను తాకే అవకాశం కూడా ఉండదు. ఈసారి భద్రతను ఏ స్థాయిలో పటిష్టం చేశారంటే.. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష జరిగే జూన్ 21వ తేదీ వరకూ ఒక రహస్య ప్రాంతంలో పూర్తిగా నిర్బంధంలో ఉంచారు. బయటి ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధాలు లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. క్వశ్చన్ పేపర్ల బాక్సులకు హైటెక్ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా పరిశీలిస్తారు. రీ-ఎగ్జామ్‌కు ముందు సోషల్ మీడియాలో నకిలీ పేపర్లు అమ్ముతూ విద్యార్థులను మోసం చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు.. మరోవైపు సైబర్ విభాగాన్ని రంగంలోకి దించారు. గతంలో జరిగిన తప్పుల కారణంగా పరీక్ష రద్దయినందున, ఈ రీ-టెస్ట్ కోసం హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయడం లేదని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. దీనికి అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, అభ్యర్థులు ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్టీఏ కోరింది. మరో రెండు వారాల్లో నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ జరగనుంది. పేపర్ లీక్ ఆరోపణలతో ఇప్పటికే ఓసారి పరీక్షను రద్దు చేయడంతో రీ-టెస్ట్ నిర్వహణ విషయంలో ఎన్‌టీఏ అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. పేపర్ తయారీ దశ నుంచే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నీట్ యూజీ పేపర్ తయారుచేసిన నిపుణులు, పర్యవేక్షకులు, ట్రాన్స్‌లేటర్లు సహా ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ ప్రస్తుతం అత్యంత భద్రత కలిగిన రహస్య ప్రాంతంలో ఉంచినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. వీరిపై భద్రతా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంచారని తెలిపాయి.

మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలేవీ వీరికి అందుబాటులో ఉంచలేదట. కేవలం అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ఈ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పిస్తున్నారు. జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్ పూర్తయ్యేంతవరకు వీరు ఈ లాక్‌డౌన్‌లోనే ఉండనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. పేపర్ తయారీ నుంచి ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ వరకు అన్ని దశల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలుచేస్తున్నారు. పేపర్ రవాణా కోసం వాయుసేన విమానాలను వినియోగించనున్నారు. ఇదిలాఉండగా.. రీ-ఎగ్జామ్ పేపర్ సైతం లీక్ అయిందంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. దీన్ని ఎన్‌టీఏ తీవ్రంగా ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని పేర్కొంది. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 వరకు నీట్ యూజీ రీ-ఎగ్జామినేషన్ జరగనుంది.

# తృణమూల్ నేత జంగీర్ ఖాన్ అరెస్ట్

### దేశ సరిహద్దులు దాటుతుండగా పట్టివేత... ఖాన్‌పై పలు కేసులు నమోదు

**కోల్‌కతా,జూన్8(ఆర్ఎన్ఎ):** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలవరం సృష్టించిన తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత జహంగీర్ ఖాన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. గత కొన్ని రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న ఆయన్ను పశ్చిమ బెంగాల్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సోమవారం తెల్లవారు జామున వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకుంది. దేశం దాటి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా నేపాల్ సరిహద్దు ప్రాంతంలో నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఎస్టీఎఫ్ అధికారులు ఆయన ఆట కట్టించారు. జహంగీర్ ఖాన్‌పై బెంగాల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లా ఫాల్తా పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 7 క్రిమినల్ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా ఓటర్లను భయభ్రాంతు లకు గురిచేయడం, భూఅక్రమణలు, మహిళలను వేధించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. తనపై నమోదైన వరుస కేసుల్లో పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని జహంగీర్ ఖాన్ గతంలో కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. మే 18న కోర్టు ఆయనకు తాత్కాలిక ఉపశమనం కల్పించి నప్పటికీ, తాజాగా ఆ రక్షణను న్యాయస్థానం ఉపసంహరించుకుంది. కేవలం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయనో, లేదా దీని వెనుక రాజకీయ కక్షసాధింపు ఉందనే పిటిషనర్ వాదనల ఆధారంగా క్రిమినల్ కేసుల్లో రక్షణను పొడిగించలేమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే తన క్లయింట్‌పై కావాలనే వరుస కేసులు పెట్టారని, ఇదంతా రాజకీయ పగతో జరుగుతున్న వేధింపులని జహంగీర్ ఖాన్ తరఫు సీనియర్ న్యాయవాది కిషోర్ దత్తా కోర్టులో వాదించారు. అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాజ్‌దీప్ మజుందార్ ఈ వాదనను గట్టిగా వ్యతిరేకించారు. మే 21న ఫాల్తా నియోజకవర్గంలో జరిగిన రీ-పోలింగ్‌లో ఖాన్ పాల్గొనేందుకు మాత్రమే గతంలో కోర్టు రక్షణ ఇచ్చిందని, మే 24న ఫలితాలు కూడా వచ్చేసినందున ఇక ఆ ప్రొటెక్షన్‌ను పొడిగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాగా, ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గ రీ-పోలింగ్ సమయంలో బెంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గట్టి షాక్ ఇస్తూ జహంగీర్ ఖాన్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఫాల్తా ప్రాంత ప్రజల సంక్షేమం కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ఆయన ప్రకటించారు. 'నేను ఫాల్తా బిడ్డను. ఇక్కడ ప్రశాంతత, అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నాను. మన ముఖ్యమంత్రి సువేందు అధికారి ఫాల్తా అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటిస్తున్నారు. అందుకే నేను ఈ రీ-పోలింగ్ రేస్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను' అని జహంగీర్ ఖాన్ పేర్కొనడం గమనార్హం. జహంగీర్ ఖాన్ నామినేషన్ ఉపసంహరణపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. బీజేపీ ప్రభుత్వం తమ నేతలపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చిందని, టీఎంసీ పార్టీ కార్యాలయాలపై దాడులకు తెగబడి భయభ్రాంతులకు గురిచేయడం వల్లే ఖాన్ ఎన్నికల నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని ఆరోపించింది. ఏదేమైనా, కోర్టు రక్షణ కోల్పోయిన కొద్దిరోజులకే ఈ కీలక నేత నేపాల్ బోర్డర్‌లో ఎస్టీఎఫ్ చేతికి చిక్కడం ఇప్పుడు బెంగాల్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తృణమూల్ కాంగ్రెస్ నేత, ఫాల్తా అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి జహంగీర్ ఖాన్ను పశ్చిమబెంగాల్ పోలీసుల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ సోమవారం అరెస్ట్ చేసింది. జహంగీర్ ఖాన్ పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతం నుండి దేశం విడిచిపారిపోయేందుకు యత్నించాడని పోలీసులు పేర్కొన్నారు. ఏప్రిల్ 29న ఫాల్తాలో రెండవ దశ పోలింగ్ సమయంలో జహంగీర్ ఖాన్ పై అవతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఎన్నికల సంఘం ఆ ఎన్నికను రద్దు చేసి, మే 21న తిరిగి పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అయితే జహంగీర్ ఖాన్ పోటీ నుండి వైదొలిగి, పరారీలో ఉన్నాడు. ఫాల్తాలో జరిగిన రీపోలింగ్ లో బిజెపి అభ్యర్థి లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుచుకున్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జహంగీర్ ఖాన్ పై గ్రామస్థులు భూకబ్జా, దోపిడీ ఆరోపణలు చేశారు. పశ్చిమబెంగాల్ లో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత అరెస్ట్ అయిన టిఎంసి నేతల జాబితాలో జహంగీర్ ఖాన్ కూడా చేరారు. మాజీ ఎమ్మెల్యేలతో సహా పలువురు టిఎంసి నేతలను పోలీసులు అదుపులోకీ తీసుకున్నారు. 2026 మార్చిలో బాంబు పేలుడులో పాత్ర ఉందనే ఆరోపణలపై, గతవారం జాతీయ దర్యాప్తు సంస్థ మాజీ ఎమ్మెల్యే సౌకత్ మూలాను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.



## పశు సంపదతో గ్రామాల్లో సుస్థిర సంపద

### – జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి పశుసంపద కీలకమని, పాడి పరిశ్రమ అభివృద్ధి ద్వారా రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థిరమైన పాల ఉత్పత్తి ద్వారా రైతుల ఆదాయాన్ని సుస్థిరం చేసేందుకు పశు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ విధానంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి విలేజ్ హెర్డ్ ఫెర్టిలిటీ రిజిస్టర్ (వీహెచ్ఎఫ్ఆర్)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల్లో సకాలంలో చూలు కట్టించకపోవడం వల్ల రైతులు గణనీయంగా నష్టపోతున్నారని.. అందువల్ల ప్రతి పాడి పశు వును దాని పునరుత్పత్తి, ఉత్పత్తి జీవిత చక్రాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ సకాలంలో చూలు కట్టించడం, క్రమబద్ధమైన ఈతలు, అధిక పాల ఉత్పత్తి, మెరుగైన పశు ఉత్పాదకతను సాధించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సకాలంలో ఈనే పశువుల వల్ల అధిక పాల దిగుబడి ఉంటుందని.. సకాలంలో చూలు కట్టించడం వల్ల అనుత్పాదక దినాలు తగ్గి రైతులకు అధిక ఆర్థిక లాభం కలుగుతుందన్నారు. అదేవిధంగా లింగ నిర్ధారిత వీర్యం వినియోగం వల్ల ఎక్కువ ఆడ దూడలు పుట్టి పాల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. కృత్రిమ గర్భధారణ, గర్భ నిర్ధారణ, వంధ్యత్వ నివారణ, పోషకాహార నిర్వహణ, దూడల సంరక్షణ వంటి శాస్త్రీయ పునరుత్పత్తి నిర్వహణ చర్యలు పశువుల ఉత్పాదకత పెంపులో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో పశు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందని.. దీన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. ఎం.హనుమంతరావు, ఉపసంచాలకులు డా. కె.చంద్రశేఖర రావు, డా. మోజెస్ వెస్లీ, డా. ఎస్.నాగభూషణరావు, ఏడీ డా. సునంద, పశు వైద్యులు డా. మనోజ్, డా. పంకజ్, డా. చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

### 24 క్యారెట్ల ధర .1,51,690కు చేరిక

**న్యూఢిల్లీ,జూన్8(ఆర్ఎన్ఎ):** గత వారమంతా తగ్గిన బంగారం ధరలు అదే ట్రెండ్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ వారం మొదటి రోజునే మళ్లీ ధరల్లో కోత పడింది. భారత్‌లో మేలిమి బంగారం ధర సగటున రూ.1000 మేర తగ్గింది. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,690కు పడిపోయింది. క్రితం ముగింపుతో పోలిస్తే ధరలో రూ.1,040ల మేర కోత పడింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి కూడా రూ.950ల మేర తగ్గి రూ.1,39,050కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి రూ.2.7 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ఇతర నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,490గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,700గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రూ.1,51,690ల వద్ద కొనసాగుతుండగా 22 క్యారెట్ల పసిడి రూ.1,39,050ల వద్ద ట్రేడవుతోంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ.1,51,840గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,200గా ఉంది. వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.6 లక్షల నుంచి రూ.2.7 లక్షల మధ్య కొనసాగుతోంది.

# రూ. 441.88 కోట్ల కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టు మంజూరు,అభివృద్ధికి అభినందనలు




ఆల్ ఇండియా పోర్ట్స్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ బోర్డు ఆంధ్రప్రదేశ్ తరపున దేశ గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేస్తున్నాము. భారతదేశ మత్స్య, నౌకాశ్రయ, షిప్పింగ్ మరియు సముద్ర రంగాల అభివృద్ధికి ఆయన అందిస్తున్న దూరదృష్టి నాయకత్వం దేశ ప్రగతికి మార్గదర్శకంగా నిలుస్తోంది. అదేవిధంగా కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్ మరియు జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ గారికి, అలాగే పోర్ట్స్, షిప్పింగ్ మరియు జలమార్గాల శాఖ సహాయ మంత్రి శ్రీ శాంతను ఠాకూర్ గారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. తీరప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమం మరియు సముద్ర రంగ ప్రగతికి వారు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమైనది. ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. రాష్ట్ర అభివృద్ధిపై ఆయనకు ఉన్న దూరదృష్టి, సంకల్పబలం మరియు కార్యాచరణ వల్లే ప్రకాశం జిల్లాలో ప్రతిష్టాత్మకమైన రూ. 441.88 కోట్ల కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోంది. అలాగే ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ దామచర్ల జనార్ధన్ గారికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ ప్రాజెక్టు సాధనలో ఆయన చేసిన నిరంతర కృషి, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత మరియు అభివృద్ధి పట్ల చూపిన చొరవ ప్రశంసనీయమైనవి. ఆంధ్రప్రదేశ్‌కు 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉండటం రాష్ట్రానికి ప్రత్యేక బలంగా నిలుస్తోంది. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఆధారిత పరిశ్రమను అభివృద్ధి చేసి భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ దిశగా రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట వంటి గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రధాన పోర్టుల అభివృద్ధికి సుమారు రూ. 20,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించబడుతున్నాయి. అదేవిధంగా కాకినాడలో రూ. 83,000 కోట్ల గ్రీన్ అమోనియా ప్రాజెక్టు, నక్కపల్లిలో రూ. 1 లక్ష కోట్ల స్టీల్ ప్లాంట్ వంటి భారీ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఆధ్వర్యంలో రూ. 1.5 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు (వీశీఖం) కుదిరి, సుమారు 10 వేల ఉద్యోగ అవకాశాలు సృష్టించబడనున్నాయి.

కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టు వల్ల:

- యువత మరియు తీరప్రాంత ప్రజలకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- వేలాది మంది మత్స్యకార కుటుంబాల జీవనోపాధి మెరుగుపడుతుంది.
- చేపల ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ మరియు ఎగుమతి సదుపాయాలు అభివృద్ధి చెందుతాయి.
- మత్స్య, సముద్ర మరియు అనుబంధ పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తుంది.
- ప్రకాశం జిల్లా మరియు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది.
- భారతదేశ బ్లూ ఎకానమీ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తుంది.

ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును ఆల్ ఇండియా పోర్ట్స్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ హృదయపూర్వకంగా స్వాగతిస్తూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తోంది. కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టు విజయవంతంగా పూర్తై, తీరప్రాంత ప్రజలకు సుసంపన్న భవిష్యత్తును అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.

**షేక్ ఖలీఫా తుల్లా బాషా**
**చైర్మన్**
**ఆల్ ఇండియా పోర్ట్స్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ బోర్డు,**
**ఆంధ్రప్రదేశ్**

# వారం రోజులు ఉదయం గుడ్డు తినండి

## అప్పుడు ఏం జరుగుతుందో చూడండి ..!

గుడ్డు శాఖాహారమా ..? ఒకవేళ ..? ముందు గుడ్డు నుండి కోడి వచ్చిందా ..? కోడి నుండి గుడ్డు వచ్చిందా ..? ఇలాంటివి ఆకతాయి ప్రశ్నలు మనం గుడ్ల గురించి చాలా ప్రశ్నలు అడిగేవాళ్లం. మరికొన్నింటికి మరికొన్ని ప్రశ్నలు ఉండవచ్చు. నా ఉద్దేశ్యం, గుడ్లు పచ్చిగా తినడం మంచిదా? వేయించి తినడం మంచిదా ..? లేదా, ఆఫ్ బాయిల్ గుడ్డు తినడం మంచిదా లేదా ఫుల్ బాయిల్ గుడ్డు తినడం మంచిదా? ఇలాంటి ప్రశ్నలు కూడా ఉంటాయి. గుడ్లు వేయించి తినడం వల్ల వివిధ ప్రయోజనాలు ఉన్నాయి. ఒక వారం ఉడికించిన గుడ్డు తినడం వల్ల శరీరంలో అసంఖ్యాక మార్పులు వస్తాయని వైద్యులు అంటున్నారు. ఉడికించిన గుడ్డును కేవలం 1 వారాలు తిన్న తర్వాత మీ శరీరంలో ఎలాంటి మార్పులు జరుగుతాయో మీరే చూడవచ్చు. ఇది ఎలా సాధ్యమో ఈ పోస్ట్‌లో చూద్దాం..



**కాలేయం**

శరీరంలో అతిపెద్ద అవయవమైన కాలేయం ప్రభావితమైతే మరణం అతి త్వరలో మన తలుపు తడుతుంది. కాలేయంలో పేరుకుపోయిన విషాన్ని తొలగించడం ద్వారా కాలేయ నష్టం తొలగిపోతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే 1 వారం ఉడికించిన గుడ్లు తింటే మీకు దీని ప్రయోజనం లభిస్తుంది.

**వైవాహిక జీవితం**

ఉదయం ఉడికించిన గుడ్డు తినే జంటలు చాలా త్వరగా గర్భం ధరించవచ్చు. దీనిలోని విటమిన్ బి 9 సెక్స్ హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది మరియు మంచి వైవాహి జీవితంను ఇస్తుంది. తద్వారా గర్భం ధరించడం సులభం అవుతుంది.

**బరువు తగ్గుతారు**

మీరు ఎంత ప్రయత్నించినా బరువు తగ్గడం లేదా ..? ఈ బాధని పరిష్కరించడానికి మీది వేగంగా గుడ్డు. మీరు అల్పాహారం కోసం ఉడికించిన గుడ్లు తింటే చాలా తేలికగా బరువు తగ్గవచ్చు.

**రొమ్ము క్యాన్సర్**

ఉడికించిన గుడ్లు తినడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నివారించవచ్చు. కారణం దానిలోని ప్రధాన పదార్థం కోలిన్. ఉడికించిన గుడ్లు తినేవారికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం 18 శాతం తక్కువ.

**మెదడు కణాలు**

వారి పరస్పర చర్యలే మెదడు బాగా పనిచేస్తుందో లేదో తెలుసుకోవడానికి సహాయపడుతుంది. మీరు ఒక వారం ఉదయం ఉడికించిన గుడ్లు తింటే, మీ మెదడు సామర్థ్యం వేగంగా ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని కూడా పెంచుతుంది.

**ముఖ సౌందర్యం కోసం**

ఉడికించిన గుడ్లు తినడం వల్ల మన చర్మ రక్షణ పెరుగుతుందని ప్రస్తుత పరిశోధనలు సూచిస్తున్నాయి. అలాగే, ఇది పురుషుల ముఖం మీద మొటిమలను నివారిస్తుంది. ఇది బ్లాక్‌హెడ్స్‌ను కూడా తొలగిస్తుందని నిపుణులు అంటున్నారు.

**ఎన్ని గుడ్లు**

1 లేదా 2 ఉడికించిన గుడ్లను ప్రతిరోజూ క్రమం తప్పకుండా తినడం ద్వారా పై ప్రయోజనం పొందవచ్చు. అల్పాహారంలో దీన్ని తినడం మర్చిపోవద్దు.

**గుండె జబ్బులు**

రక్తంలో అధిక కొలెస్ట్రాల్ తగ్గడానికి ఉడికించిన గుడ్లు తినండి. ఇది మీకు గుండె జబ్బులు రాకుండా చేస్తుంది. అందులోని ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు కారణం.

**ఉదర ఉబ్బరం**

దీన్ని నివారించడానికి కడుపు ఉబ్బినట్లయితే అది బొడ్డులా కనిపిస్తుంది. ఇది చాలా మందికి జరుగుతుంది. ఉడికించిన గుడ్లు నివారణలు కూడా ఈ సమస్యను పరిష్కరిస్తాయి. మీ కడుపు ఉబ్బరాన్ని తగ్గించడానికి ఉడికించిన గుడ్లు సరిపోతాయి.

**ఎముకలకు**

ఉడికించిన గుడ్లు తినడం వల్ల ఎముకలు దెబ్బతినకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాటిలో విటమిన్ డి ఎముక క్షీణత మరియు కీళ్ల నొప్పులను నయం చేస్తుంది.

# వ్యాయామం లేకుండా కొవ్వును తగ్గించే ఆహారాలు ..!



మన శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉంటే, బరువు తగ్గడం అంత సులభం కాదు. ఈ కొవ్వు ఉదరం, తొడలు, వీపు, చేతులు మొదలైన వాటిలో పేరుకుపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా వెనుక మరియు తొడలలో పేరుకుపోయిన కొవ్వు పరిమాణాన్ని తగ్గించడం కొద్దిగా గమ్మత్తైనది. ఈ ప్రదేశంలో కొవ్వు చాలా మందికి చాలా ఇబ్బంది కలిగిస్తాయి. ఈ ప్రాంతంలో పేరుకుపోయిన కొవ్వులు ప్యాంటు ధరించడానికి కూడా నలుగురిని పిలవవలసిన స్థితిలో మమ్మల్ని ఉంచాయి. మరి అప్పుడు దీనిని తగ్గించలేము ..? కానీ సంతోషకరమైన వార్త మీకు కోసం వేచి ఉంది. అదే సులభమైన మార్గం ఫ్యాట్ కరిగించే ఆహారాలు. ఈ కొవ్వును కొన్ని ఆహారాలతో తగ్గించవచ్చు. ఇప్పుడు అవి ఏ ఆహారాలు మరియు వాటి స్వభావం ఏమిటో ఇక్కడ తెలుసుకోండి..

**ఎందుకు చేరుతుంది ..?**

మన శరీరంలో కొవ్వు ఎందుకు పేరుకుపోతుంది అనే ప్రశ్నకు సమాధానం చాలా సులభం. ఈ పరిస్థితికి ప్రధాన కారణం మనం తినే అధిక కేలరీల ఆహారాలు మరియు అధిక కొవ్వు పదార్థాలు. ఇవి శరీరంలో కార్యాచరణను తగ్గిస్తాయి మరియు ఆకలి, సోమరితనం, బరువు పెరగడం వంటి సమస్యలను పెంచుతాయి.

**కారంగా ఉండే ఆహారాలు**

మీరు తినే ఆహారాలలో అధిక క్షారతను చేర్చండి. అలాగే, పసుపు వంటి కొవ్వు తగ్గించే పదార్థాలను జోడించడం వల్ల చాలా త్వరగా ప్రయోజనం లభిస్తుంది. కారణం, దానిలోని ముడి పదార్థం కర్కుమిన్ కొవ్వును తొలగించే సామర్థ్యం కలిగి ఉంటుంది.

**దాల్చిన చెక్క టీ**

ఈ ఆహార పదార్థం మీకు అనేక విధాలుగా సహాయపడుతుంది. టీ లాగా తాగడం వల్ల తిరిగి కొవ్వు తగ్గుతుంది. దీని కోసం కావలసినవి ... దాల్చిన చెక్క 1 1 టేబుల్ స్పూన్ తేనె

**ఉపయోగించే పద్ధతి:**

– మొదట దాల్చినచెక్క పొడి సిద్ధం చేసుకోవాలి. తరువాత, 1 గ్లాసు నీరు ఉడకబెట్టి, అందులో ఈ పొడిని కలపండి. 5 నిమిషాలు మీడియం వేడి మీద మరిగించి గ్లాసులోకి తీసుకోండి. తరువాత దానితో తేనె కలపండి మరియు ఉదయం లేదా పడుకునే ముందు త్రాగాలి.

**ఫైబర్ పోషణ**

మీరు ఫైబర్ అధికంగా ఉన్న ఆహారాన్ని తింటే మీరు తొడ మరియు వెనుక భాగంలో ఉండే కొవ్వును తగ్గించవచ్చు. దీని కోసం, ఆహారంలో ఎక్కువ ఓట్స్, బ్రోకలీ మరియు గోధుమలు కలిపితే సరిపోతుంది. అలాగే, నారింజ వంటి పండ్లు తినండి.

**ఉసిరికి కాయ**

ఈ నెల్లి కొవ్వును తగ్గించడంలో మరియు సమతుల్య శరీర నిర్మాణాన్ని ఉంచడంలో చాలా సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది మరియు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది. మీరు దీన్ని ఖాళీ కడుపుతో తయారు చేసి తాగితే, మీరు త్వరగా కొవ్వును తగ్గించవచ్చు. అవసరమైన పదార్థాలు ... అర కప్పు గూస్బెర్రీ రసం సగం చెంచా తేనె

**తయారుచేసే పద్ధతి ...**

గూస్బెర్రీస్ తీసుకొని వాటిని ముక్కలుగా కట్ చేసి. తరువాత, దానిని వడకట్టి, కొద్దిగా తేనె వేసి ఉదయం ఖాళీ కడుపుతో త్రాగాలి. మీరు దీన్ని 1 నెల పాటు కొనసాగిస్తే, వెనుక కొవ్వు తగ్గుతుంది.

**గ్రీన్ టీ**

ఇది ప్రయోగాత్మకంగా నిరూపించబడింది. అంటే, మీరు ఉదయం క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగితే, అందులోని యాంటీఆక్సిడెంట్లు కొవ్వు తగ్గడానికి మీకు సహాయపడతాయి. ఇది శరీర బరువును తగ్గించే సామర్థ్యం కూడా కలిగి ఉంటుంది.

**మానుకోండి ..!**

ఒకవైపు ఆయిల్ ఫుడ్స్ తినడం, మరోవైపు కొవ్వు పదార్థాలు తినడం వల్ల శరీర కొవ్వు తగ్గదు. అందువల్ల, జిడ్డుగల ఆహారాలకు దూరంగా ఉండాలి. అలాగే, వీధుల్లో అమ్మగలిగే ఆహారాన్ని తినడం మానుకోండి.

# పంటి నొప్పి నయం కావడానికి మార్గాలివే...!



మానవులలో చాలా ముఖ్యమైన నొప్పి పంటి నొప్పి. పంటి నొప్పి వచ్చినప్పుడు వారు ఆహారం సరిగ్గా తినలేరు. శరీరానికి తగినంత పోషకాహారాన్ని అందించే ఆహారం లేనప్పుడు శరీరం తనంతట తాను త్వరగా అలసిపోతుంది. పంటి నొప్పి నయం అయ్యేవరకు మనం ఏ పని జాగ్రత్తగా చేయలేము. పంటి నొప్పి అనేది దంతాలను మాత్రమే కాకుండా మన మొత్తం శరీరాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. దంతాల నొప్పికి పంటి నొప్పి, చిగుళ్ల సమస్య, విరిగిన పళ్ళు వంటి అనేక కారణాలు ఉన్నాయి. తీవ్రమైన పంటి నొప్పి వచ్చినప్పుడు మనం మొదట వైద్య సహాయం తీసుకుంటాము. కానీ మన పూర్వీకులు, అన్ని సమస్యలను పరిష్కరించడానికి బయలుదేరిన వారు పంటి నొప్పిని వదిలివేస్తారా?. ఈ పోస్ట్‌లో మీరు మన పూర్వీకులు ఉపయోగించే పంటి నొప్పికి చాలా మంచి సాధారణ ఇంటి నివారణలను చూడవచ్చు.

**లవంగం నూనె**



పురాతన కాలం నుండి లవంగాన్ని పంటి నొప్పికి అద్భుతమైన ఔషధంగా ఉపయోగిస్తున్నారు. అందులోని లవంగం నూనె సమ్మేళనం సహజ ఔషధం. అయితే దీన్ని ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండండి. మీరు లవంగా నూనెను ప్రభావిత ప్రాంతంపై పూసినప్పుడు మరియు అది చిగుళ్ళు లేదా నాలుకలో చిక్కుకున్నప్పుడు నొప్పి మరింత తీవ్రమవుతుంది. ఒక పత్తి ఉండపై రెండు చుక్కల లవంగా నూనె పోసి, బాధాకరమైన పంటిపై పూయండి మరియు నొప్పి తగ్గే వరకు అక్కడే ఉంచండి. బాధాకరమైన దంతంపై లవంగం పొడి లేదా ఒకటి రెండు లవంగాలు వేసి రసాయనాన్ని విడుదల చేయడానికి లవంగాలను కొరకడం లేదా పంటితో అదిమి పెట్టుకోవాలి. అరగంటలో నొప్పి తగ్గుతుంది.

**అల్లం మరియు ఎర్ర మిరపకాయలు**

అల్లం మరియు ఎర్ర మిరపకాయలు రెండూ వేడిగా ఉంటాయి. కాబట్టి ఈ రెండింటినీ సమాన నిష్పత్తిలో తీసుకొని అవసరమైన నీటితో పేస్ట్‌గా రుబ్బుకోవాలి. చిగుళ్ళు మరియు నాలుకను తాకకుండా ఉండటానికి ఈ పేస్ట్‌ను చిన్న కాటన్ క్లాత్ మీద తీసుకొని బాధాకరమైన దంతాలపై ఉంచండి. దీనిని ఒక్కొక్కటిగా కూడా ఉపయోగించవచ్చు. ఈ రెండూ అద్భుతమైన నొప్పి నివారణ మందులు. ఉప్పు నీరు వేడినీటిలో ఒక చెంచా ఉప్పు వేయడం మరియు దానితో గార్లింగ్ చేయడం పంటి నొప్పికి ఉత్తమ నొప్పి నివారణ. ఇది దంతాలలో చికాకు మరియు వాపు సంభవించడాన్ని తగ్గిస్తుంది. ఈ నీటిని మీ నోటిలో 30 సెకన్ల పాటు ఉంచి, ఆపై ఉమ్మివేయండి.

**ఉప్పునీరు**

దంతాల చుట్టూ ఉన్న ప్రాంతాలను శుభ్రపరుస్తుంది మరియు మంటను కలిగించే ఆమ్లాలను బహిష్కరిస్తుంది. పిప్పరమింట్ టీ పిప్పరమింట్ టీ రుచిగా ఉంటుంది మరియు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఎండిన మింట్ ఆకులను ఆకులను వేడినీటిలో వేసి 20 నిమిషాలు ఉడకబెట్టండి. టీ చల్లబడిన తరువాత లేదా గార్గిలింగ్ చేసిన తర్వాత దీన్ని త్రాగాలి. దానిలోని టానిన్ మీకు దంతాల వల్ల వచ్చే వాపును తగ్గిస్తుంది. నొప్పిగా ఉన్న పంటిపై వేడి టీ బ్యాగ్ ఉంచడం వల్ల వెంటనే ఉపశమనం లభిస్తుంది.

# ఘనంగా తొలి స్నేహ హస్తం రచ్చ బండ కార్యక్రమం



**విజయవాడ, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆల్ ఇండియా పోర్ట్ ట్రాస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యర్యంలో ఘనంగా ప్రారంభంమైన స్నేహహస్తం రచ్చ బండ కార్యక్రమం. మత్స్యకారుల సమస్యలు తెలుసుకోనటానికి, మత్స్యకారులు పరిష్కారించి వారికి చేయూత్తానియడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు నివాసించే గ్రామాలలో స్నేహ హస్తం రచ్చ బండ కార్యక్రమం లో భాగంగా బాపట్ల జిల్లా బాపట్ల నియోజకవర్గం లోని పెను మూడి గ్రామంలో మత్స్యకార సంఘ సభ్యుడు వల్లభనేని వెంకటేశ్వరరావు అధ్యక్షుతన ఆల్ ఇండియా పోర్ట్ ట్రాస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ బోర్డు ఏపి చైర్మన్ షేక్ ఖలీఫా తుల్లా బాషా గారు ముఖ్య అతిధిగా పాల్గొని రాష్ట్రశీ లోనే పెను మూడి గ్రామం లో ఘనంగా తోలి స్నేహ హస్తం రచ్చ బండ కార్యక్రమం న్ని ప్రారంభించిన్నారు. ఈ కార్యక్రమం లో పెద్ద ఏతున్న మత్స్యకారులు ముఖ్యం గా మహిళాలు పాల్గోని వారి సమస్యలను తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా పోర్ట్ ట్రాస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ బోర్డు ఏపి చైర్మన్ షేక్ ఖలీఫా తుల్లా బాషా కార్యక్రమన్ని ఉద్దేసించి మాట్లాడుతూ మత్స్యక సోదరులు అనేక సమస్యలతో శతమాతమౌతున్న సందర్భాలలో వారి సమస్యలు పరిష్కారమార్గం కోసం ఈ స్నేహ హస్తం రచ్చ బండ కార్యక్రమం ప్రారంభించా మన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చీణా కూటమిలో భాగమై ఉన్నాందున ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమిష్టిగా ప్రజాభ్యునాతికి దేశఅభిరుద్ధికి కృషి చేస్తున్నారని మత్స్యకారుల సంక్షేమశీ కోసం అనేక పథకాలు ఇస్తున్నారన్నారు. వేట నిషేధశీ ఉన్నందున రాష్ట్రశీ లో 1,30,796 మత్స్యకార కుటుంబాలకు వారి జీవనోపాధి కి నేరుగా వారి ఖాతాలో 20 వేల రూపాయలు 261,59 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. 72 కోట్లతో కాకినాడ పోర్ట్ ఆధునికిరణ, ఏపి మత్స్యకారులకు 200 ఆధునిక బోట్లు, ఏపి లో నేషనల్ ఫిష్ డెవలప్మెంట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు, సీ -ఫుడ్ రావణకు ఏపి ఎయిర్ ఫ్లాట్ స్టేషన్లు, మరియు ప్రకాశం జిల్లా ఒంగోలు నియోజకవర్గం లోని కొత్తపట్నం లో షిపింగ్ హార్బర్ ప్రాజెక్టు ను నిర్మాణం కోసం 441 కోట్ల రూపాయలు మంజూరు చేయడం అనేక మంది ఉపాధి అవకాశాలు కలుగుతాయ్యన్నారు. మత్స్యకారు సోదరులు తమ బోట్లకు ఇన్సూరెన్స్ చేయుంచుకోవాలని ఇన్సూరెన్స్ లేకపోతే ఏదైనా ప్రమాదం జరిగితే పూర్తి స్థాయి లో నష్టాల కు గురై కుటుంబాలు విధిన పడ్తాయి అన్నారు. మన వల్లభనేని వెంకటేశ్వర రావు తన సుమారు 50 లక్షల బోటు ప్రమాదంలో పూర్తిగా కాళీ ఇన్సూరెన్స్ లేనందున నష్టపోయాడని అన్నారు. వల్లభనేని వెంకటేశ్వర రావు కు ప్రభుత్వ పరంగా బోటు పూర్తి మార్మతులు చేయించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. స్నేహ హస్తం రచ్చ బండ కార్యక్రమం లో వచ్చిన సమస్యల అర్జీలలో ముఖ్యశీ గా ఈ గ్రామానికి తుఫాన్ సెల్టార్ ఏర్పాటు, గ్రామం లో ఉన్న చాలా మందికి వారి బోట్లు కు వున్న ఇంజాన్ పూర్తిగా చేడి పోయినప్పుడు ప్రభుత్వ పరంగా కొత్త ఇంజాన్ ఇచ్చి అదుకోవాలని కోరడం, వేటకు వెళ్లడానికి డిజల్ అయిల్ 100 బోట్లు ఉంటే ఏఒక్కరికి రావడం లేదని తమకు డిజల్ అయిల్ ఇప్పిచి అదుకోవాలని గ్రామం లో వున్న మత్స్యకార సోదరులు అందరు వేడుకున్నారు. పెను మూడి గ్రామ మత్స్యకారుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమం విశ్వనాధపల్లి వెంకటేశ్వరరావు(బాబు), ఆంధ్ర ప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, మరియు AIPTWF ఏపి సభ్యుడు పిన్ని సాంబాశివరావు,నిజాంపట్నం పోర్ట్ ఇంచార్జీ షేక్ బాజీ షరీఫ్, బందర్ పోర్ట్ ఇంచార్జీ శ్రీ. నడికుడిటి సురేష్ బాబు , AIPTWF చైర్మన్ పర్సనల్ సెక్రటరీ షేక్ బాచి. పెను మూడి గ్రామ పెద్దలు పార్గొన్నారు.

# పెళ్లికి ముందే శారీరక సంబంధాలు

**ఇది మోసపూరితమని చెప్పలేం... పరస్పర అంగీకారంతోనే జరగినట్లు గుర్తించాల్సిందే సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,జూన్8(ఆర్ఎన్ఎ):** పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పెళ్లికి ముందు పరస్పర అంగీకారంతో ఏర్పడిన శారీరక సంబంధాల ఆధారంగా ఒక వ్యక్తి వ్యక్తిత్వం లేదా నడవడికను ప్రశ్నించలేమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రేమ సంబంధాలు అన్నీ వివాహానికి దారితీయవని తెలిపింది. ఇద్దరి మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడిన ప్రేమ బంధం తర్వాత వివాహంగా మారకపోయినా, దానిని మోసం లేదా నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అలాగే, ప్రేమలో ఉన్న సమయంలో వివాహం చేసుకుంటామని భావించి శారీరక సంబంధం ఏర్పడినప్పటికీ, తర్వాత వివిధ కారణాల వల్ల పెళ్లి జరగకపోతే ప్రతి సందర్భంలోనూ అది మోసం చేసినట్లుగా భావించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నామినేషన్లు వేసిన టిడిపి రాజ్యసభ అభ్యర్థులు

**సానా సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ నామినేషన్లు**

**అమరావతి,జూన్8(ఆర్ఎన్ఎ):** టీడీపీ రాజ్యసభ అభ్యర్థులుగా సానా సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం ఉదయం ఏపీ అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10:50 గంటల నుంచి 11:50 గంటల వరకు నామినేషన్ కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణికి ముగ్గురు టీడీపీ అభ్యర్థులు.. రెండు సెట్‌ల చెప్పున నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హాజరయ్యారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారీగా తరలివచ్చారు. జనసేన ఎమ్మెల్యేలు, బీజేపీ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కూటమి ఐక్యతకు ప్రతీకగా రాజ్యసభ నామినేషన్ కార్యక్రమం జరిగింది. వంగవీటి రాధాకృష్ణ సహా పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. టీడీపీ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం అసెంబ్లీలో సందడిగా సాగింది. అంతకుముందు ఉదయం వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు సాన సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వెంకటపాలెం టీటీడీ దేవస్థానం పండితులు సాదర స్వాగతం పలికారు. టీడీపీ అభ్యర్థులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని వేద పండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఏపీ అసెంబ్లీ వరకు టీడీపీ అభ్యర్థులు సైకిళ్లపై వెళ్లి.. ఆపై నామినేషన్ దాఖలు చేశారు.

## పెన్నా నదిలో విషాదం.. స్నానానికి వెళ్లి అత్త, అల్లుడు మునిగి మృతి



**విజయవాడ , జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వేపరాల గ్రామం సమీపంలోని పెన్నా నదిలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. స్నానానికి వెళ్లిన అత్త, అల్లుడు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల వివరాల ప్రకారం, తొర్రివేముల గ్రామానికి చెందిన కళ్యాణ్ కుమార్ (25), అతని అత్త వెంగమ్మ (45) కుటుంబ సభ్యులతో కలిసి నది వద్దకు వెళ్లారు. స్నానం చేస్తుండగా నీటి లోతును సరిగా అంచనా వేయలేక ఇద్దరూ ఒక్కసారిగా లోతైన ప్రాంతంలోకి వెళ్లి మునిగిపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే రక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో కళ్యాణ్ కుమార్ మృతదేహాన్ని వెలికితీయగా, వెంగమ్మ కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ దుర్ఘటనతో తొర్రివేముల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చంద్రబాబు వెన్నుపోటుపై రౌండ్ టేబుల్ సమావేశం



**ఆచంట జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పోడూరు మండలం తూర్పుపాలెం వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి రంగనాథరాజు అధ్యక్షతన సోమవారం 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ విధానాలపై రంగనాథరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్ల పాలనలో హామీలను నెరవేర్చకుండా, మహిళలను, విద్యార్థులను మోసం చేయడమే కాకుండా నిత్యవసర వస్తువుల ధరలు పెంచారని ఆయన దుయ్యబట్టారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## పావగడ మాజీ ఎమ్మెల్యేకు ఈర లక్కప్ప నివాళులు



**మడకశిర జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పావుగడ మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ ఇటీవల మరణించగా, సోమవారం పావగడలో ఆయన వైకుంఠ సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మడకశిర వైకాపా ఇన్చార్జ్ ఈర లక్కప్పతో పాటు పలువురు వైకాపా నాయకులు హాజరై వెంకటరమణకు నివాళులు అర్పించారు. అనంతరం, వారు ప్రస్తుత ఎమ్మెల్యే, వెంకటరమణ కుమారుడు వెంకటేష్ ను పరామర్శించారు.

## బాపట్ల నూతన పురపాలక కమిషనర్ గా హాసిని బాధ్యతలు స్వీకరణ



**బాపట్ల జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బాపట్ల పురపాలక సంఘ కమిషనర్ గా సోమవారం హాసిని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, ఆమె పురపాలక సంఘ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. బాపట్ల పురపాలక సంఘ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, పట్టణ అభివృద్ధిలో గతంలో కన్నా పురోగతి సాధించాలని కలెక్టర్ హాసినికి సూచించారు. ఈ సంఘటన బాపట్ల పట్టణంలో జరిగింది.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ప్రజలు ఖండించాలి



**నిడదవోలు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.29లు పెంచి ప్రజలకు బహుమతి ఇచ్చిందని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నిడదవోలు మండలం సింగవరంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదని రాంబాబు విమర్శించారు. భవిష్యత్తులో కూడా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచాలనే ప్రయత్నిస్తున్నట్లుగా ఉందని దీనిని ప్రజలు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి యుద్ధాన్ని సాకుగా చూపి ప్రజలపై కక్ష తీర్చుకుంటూ దేశంలోని బడా కార్పోరేట్లకు లాభాలు చేకూరుస్తూ లొంగుబాటు ప్రదర్శిస్తుందన్నారు. ఈ నెల 9న జరిగే రాస్తారోకో కార్యమాలను జయప్రదం చెయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పభుత్వం దృష్టికి సమస్యలు.. త్వరలోనే అందుబాటులోకి కొత్త వ్యవస్థ: మంత్రి అనిత!



**విజయనగరం జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పట్టాదారు పాసుపుస్తకాల ద్వారా భూమిపై సంపూర్ణ, శాశ్వత హక్కులు కల్పించి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లాలోని ఎస్.కోట నియోజకవర్గం వేపాడ మండలం బల్లంకిలో సోమవారం ప్రభుత్వ రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి అనిత రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వ పాలనలో రీ సర్వే తప్పుగా నిర్వహించి రైతులు, భూ హక్కుదారులను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. 70 శాతం తప్పులతో పాస్ పుస్తకాలు తయారు చేయడంతో రైతులు గందరగోళానికి గురయ్యారని అన్నారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే జిల్లాల్లో ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులకు అందకపోతే చరవాణి ద్వారా నేరుగా ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లేందుకు త్వరలోనే ఓ నూతన వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో నిబద్ధతతో ప్రజలకు సేవ చేస్తున్నామని వివరించారు.

## రామోజీరావు ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తి: మంత్రి డోలా



**టంగుటూరు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సామాజిక చైతన్యం కోసం పత్రిక రంగం ద్వారా రామోజీ రావు కృషి చేశారని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం రామోజీరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎంతో మందికి ఆదర్శంగా ఎదిగిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. పత్రికలు అంటే వ్యాపారం కాదని, సామాజిక బాధ్యత అని భావించి... ఆచరించి చూపిన దార్శనికుడు అని అన్నారు. విలువలు, క్రమశిక్షణ, నిబద్ధత, ధైర్య సాహసాలతో నిలిచిన ఆయన ప్రస్థానం భావి తరాలకు స్ఫూర్తి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి మండల నాయకులు పోకూరి రవీంద్రబాబు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో చోరీకి పాల్పడ్డ దొంగలు అరెస్టు



**అనకాపల్లి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చెడు వ్యసనాలకు బానిసలైన ఇద్దరు యువకులు ఆలయంలో చోరీ చేసి చివరికి పోలీసులకు చిక్కారు. ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపిన వివరాల ప్రకారం.. నక్కపల్లి మండలం రేవల్ల కొత్తూరు గ్రామానికి చెందిన కసిరెడ్డి శ్రీహరి, రేబాక గ్రామానికి చేసిన గంట్యాడ శ్రీను వెల్డింగ్ పని చేస్తుంటారు. చెడు వ్యసనాలకు బానిసై డబ్బులు సరిపోక చోరీలు చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ నెల 3న ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీకి యత్నించారు. విఫలమడంతో కొండ దిగువనున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీ పగలగొట్టారు. పక్కనే ఉన్న ఆండాలమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు, బంగారు, వెండి వస్తువులు అపహరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారురు. సోమవారం నిందితులిద్దర్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,38,078, 56 గ్రాముల బంగారం, 2 కేజీల 600 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.17,68,000 ఉంటుందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

## వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి విశేష స్పందన



**మంగళగిరి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా మంగళగిరి పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ శిబిరంలో సోమవారం విద్యార్థులకు ప్రత్యేక ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. విద్యార్థులు మంగళగిరి హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి చేనేత చీరల తయారీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్థానిక పోలీస్‌స్టేషన్లను సందర్శించి ఆయా శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానంతోపాటు సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల ఆసక్తి పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.

## బిహార్‌లో బస్సు ప్రమాదం..

### ఏపీ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు



**నెల్లూరు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బిహార్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం ఆత్మకూరు నుంచి కొంతమంది యాత్రికులు వారణాసికి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. ఈ క్రమంలో బిహార్‌లోని ఔరంగబాద్‌కు 7 కిలోమీటర్ల దూరంలో వీరు ప్రయాణిస్తున్న బస్సు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. 15 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు. "ప్రమాద విషయం తెలియగానే దిల్లీ నుంచి జిల్లా అధికారులను అప్రమత్తం చేశాం. వెంటనే సహాయక చర్యలు చేపట్టాం. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. గాయపడిన వారిని గయా ఆసుపత్రికి తరలించారు. బిహార్ ప్రభుత్వం, అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. దిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సమన్వయంతో చర్యలు చేపట్టారు. క్షేమంగా ఉన్న వారిని వెనక్కి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం" అని మంత్రి తెలిపారు.

## ఎరువులు పంపిణీ చేసిన పల్లె రఘునాథ్ రెడ్డి



**పుట్టపర్తి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రైతులకు వ్యవసాయ అవసరాలకు తగిన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

## గీత కులాల జీవనోపాధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక: జనతా వారధి వినతి



**భీమవరం జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరంలో సోమవారం, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలోని జనతా వారధి, గీత కులాల జీవనోపాధి పరిరక్షణకు, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి బీఎస్ .శివనారాయణకు వినతిపత్రం అందించింది. గంగరాజు మాట్లాడుతూ నీరా ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ.వెంకటేశ్వర్లు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, కాగిత సురేంద్ర, వీరవల్లి ప్రసాద్, భూపతిరాజు సుబ్బరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు7 అర్జీలు నమోదు



**రేపల్లె జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ, రేపల్లె, వేమూరు, భట్టిప్రోలు మండలాల నుండి ప్రజలు వివిధ సమస్యలపై ఏడు అర్జీలు అందించినట్లు తెలిపారు. ఈ అర్జీలను పరిశీలించి, సంబంధిత అధికారులకు పంపి సమస్యలను పరిష్కరిస్తానని ఆమె మీడియాకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎస్ సాయిప్రసాద్ ఆకస్మిక తనిఖీ

### : రెవెన్యూ క్లీనిక్‌ను పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుంటూరు జిల్లా కలెక్టర్‌ను సీఎస్ సాయిప్రసాద్ ఆకస్మికంగా సందర్శించి, రెవెన్యూ క్లీనిక్‌లో అర్జీలు సమర్పిస్తున్న విధానాన్ని, సిబ్బంది సేవల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలు అందిస్తున్నందుకు రెవెన్యూ క్లీనిక్ వ్యవస్థను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్థిక ప్రగల్భత, డీఆర్వో భాస్కర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సుకుమార్ హ్యాపీ... రామ్ చరణ్ హ్యాపీ



తన కెరీర్లో ఇంకే చిత్రానికీ పడనంత కష్టాన్ని 'పెద్ది' సినిమా కోసం పడ్డాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ఇందులో కుస్తీ యోధుడి పాత్ర కోసం చరణ్ తన దేహాన్ని ఎలా మార్చుకున్నాడో తెలిసిందే. తెరపై రెజ్లింగ్ సీన్లు చూసి అందరూ అవాక్కయిపోయారు. నిజంగా ఒక ప్రొఫెషనల్ రెజ్లర్‌ను చూస్తున్న భావనే కలిగింది ప్రేక్షకులు. తెలుగులో ఒక స్టార్ హీరో నుంచి ఇలాంటి ట్రాన్స్‌ఫర్మేషన్, పర్ఫెక్షన్ అరుదు. ఐతే దీని వెనుక చాలా కష్టమే ఉంది. ఒళ్లు హూనమయ్యేలా కష్టపడిన చరణ్.. తన చేతిని దెబ్బ తీసుకున్నాడు. 'పెద్ది' ప్రమోషన్లలో కుడి చేతికి అతను బ్రేస్‌తో కనిపించిన సంగతి తెలిసిందే. షూట్ పూర్తయ్యాక స్కాన్స్ తీస్తే ఏకంగా 7 టియర్స్ ఉన్నట్లు చరణ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రమోషన్లకు ఇబ్బంది రావద్దని అతను సర్జరీ చేయించుకోలేదు. ఐతే ఈ సినిమా రిలీజైపోవడంతో చరణ్ అతి త్వరలో శస్త్రచికిత్స చేయించుకోబోతున్నాడు. సర్జరీ అయ్యాక మూడు నెలల పాటు విశ్రాంతి తీసుకోబోతున్నాడట మెగా పవర్ స్టార్. ఐతే 'పెద్ది' రిలీజవ్వగానే సుకుమార్ దర్శకత్వంలో కొత్త సినిమాను మొదలుపెట్టాలని అనుకున్నాడు కానీ.. ఇప్పుడు సర్జరీ వల్ల అది ఆలస్యం కాబోతోంది. చరణ్ వెంటనే అందుబాటులోకి రావట్లేదని సుకుమార్ ఏమీ ఫీల్ కావట్లేదని సమాచారం. మూడు నెలలు టైం కావాలని అడిగితే సంతోషంగా ఒప్పేసుకున్నాడట. కారణమేంటంటే.. చరణ్ సినిమాకు ఇంకా బౌండ్ స్క్రిప్టు రెడీ కాలేదు. 'పుష్ప-2' రిలీజై ఏడాదిన్నర కావస్తున్నా ఆయనకు టైం సరిపోలేదు. సుకుమార్ ఒక కథను ఓకే చేయడానికే చాలా టైం తీసుకుంటాడు. తర్వాత బౌండ్ స్క్రిప్టుకు కూడా చాలా టైం పడుతుంది. తన రైటింగ్ టీంతో కలిసి నెలల తరబడి కసరత్తు చేస్తాడు. చరణ్ సినిమాకు కథ ఓకే అయింది కానీ.. స్క్రీన్ ప్లే, డైలాగ్ వెర్షన్ రెడీ కాలేదు. ఇప్పుడు పని మొదలుపెడితే మూణ్నాలుగు నెలలు టైం పడుతుంది కాబట్టి చరణ్ టైం కావాలంటే హ్యాపీగా సరే అనేశాడు సుకుమార్. తనకు సుక్కు టైం ఇచ్చినందుకు చరణ్ కూడా హ్యాపీనే. ఈ సినిమా కోసం పని చేస్తున్న టీం వర్గాల సమాచారం ప్రకారం ఈ ఏడాది చివరికి గానీ ఈ సినిమా మొదలయ్యే అవకాశం లేదు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కలిసి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేయబోతున్నాయి. రాయలసీమ-ముంబయి బ్యాక్‌డ్రాప్‌లో ఈ కథ సాగుతుందని సమాచారం. ఇంతకుముందు సుకుమార్, చరణ్ కాంబినేషన్లో వచ్చిన 'రంగస్థలం' కల్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన నేపథ్యంలో ఈ చిత్రంపై ఉండే అంచనాలను అందుకోవడం అంత తేలిక కాదు.

# దసరా పండక్కు బాలయ్య -- వెంకీ క్లాష్ ?



సీనియర్ స్టార్ హీరోలు మరోసారి బాక్సాఫీస్ క్లాష్ కు రెడీ అయ్యేలా ఉన్నారు. వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న ఆదర్శ కుటుంబం షూటింగ్ చివరి దశకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇదింకా పూర్తి కాకుండానే వెంకటేష్ ఈ నెలలో అనిల్ రావిపూడి సెట్స్ లో అడుగు పెట్టబోతున్నారు. అక్టోబర్ 2 అనుకున్నప్పటికీ ఫైనల్ గా దసరా సందర్భంగా అక్టోబర్ 16 ఆదర్శ కుటుంబం రిలీజ్ చేసేలా ప్లానింగ్ జరుగుతోందట. ట్విస్ట్ ఏంటంటే బాలకృష్ణ-గోపీచంద్ మలినేని కాంబోలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్ టైనర్ ని సైతం దసరాని టార్గెట్ చేసుకునే ఉద్దేశంతోనే చిత్రీకరణ వేగంగా జరుపుతున్నారట. బాలయ్య నాన్ స్టాప్ కోఆపరేషన్ వల్ల ఇది సాధ్యమయ్యేలా ఉందని యూనిట్ వర్గాలు అంటున్నాయి. గతంలో భగవంత్ కేసరి ఈ ఫెస్టివల్ కే వచ్చి సూపర్ హిట్ అందుకుంది. లియో, టైగర్ నాగేశ్వరరావు లాంటి టఫ్ పోటీని తట్టుకుని ఆ నెలలో విజేతగా నిలిచింది. కలెక్షన్లు అవార్డులు గెలుచుకుంది. చూస్తుంటే బాలకృష్ణ, వెంకటేష్ పరస్పరం బాక్సాఫీస్ వద్ద తలపడేలా ఉన్నారు. అయితే జూన్ 10 బాలయ్య పుట్టినరోజు సందర్భంగా వదలబోయే టీజర్ లో విడుదల తేదీని రివీల్ చేస్తారా లేదానేది ఆసక్తికరంగా మారింది. అక్టోబర్ 16 దాదాపు ఖాయమని యూనిట్ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. ఇదే నిజమైతే మంచి మాస్ ప్లస్ క్లాస్ పోటీని థియేటర్లలో చూడొచ్చు. ఇప్పటికైతే రెండు నిర్మాణ సంస్థల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనలు రాలేదు. ఇక సినిమాల విషయానికి వస్తే ఆదర్శ కుటుంబం సక్సెస్ వెంకటేష్ కన్నా త్రివిక్రమ్ కే చాలా ముఖ్యం. ఎందుకంటే నెక్స్ట్ ప్లాన్ చేసుకున్న ప్యాన్ ఇండియా మూవీకి మార్కెట్ జరగాలంటే ఇది చాలా కీలకం. వీరసింహారెడ్డని మించిపోయేలా మూవీ ఇస్తారని బాలయ్య ఫ్యాన్స్ ఆశలను టన్నుల లెక్కల్లో పెంచేసుకున్నారు. వెంకటేష్ ఫ్యాన్స్ సైతం తొలిసారి త్రివిక్రమ్ డైరెక్షన్ లో నటించడం పట్ల చాలా ఎగ్జైటింగ్ గా ఉన్నారు. ఈసారి ఫన్ తో పాటు క్రైమ్ కూడా ఉంటుందట




# దృశ్యం 3 ఎండింగ్.. మాస్టర్ ప్లాన్ ఉందా లేక కన్ఫ్యూజనా?



దృశ్యం 3 థియేటర్లలో 200 కోట్ల వసూళ్లతో బాక్సాఫీస్ దగ్గర సత్తా చాటింది. కానీ సినిమా చూసిన ప్రేక్షకుల బుర్రలో ఒకే ప్రశ్న తిరుగుతోంది. దర్శకుడు జీతూ జోసెఫ్ కథకు సరైన ముగింపు ఇవ్వకుండా సస్పెన్స్ తో ఎందుకు వదిలేశాడు అనేది ఇప్పుడు పెద్ద డిస్కషన్ గా మారింది. ఇది కావాలని ప్లాన్ చేసిన ఎత్తుగడా లేక కథను ఎలా ముగించాలో తెలియక చేసిన పనా అనే డిస్కషన్ మొదలైంది. జార్జ్ కుట్టీ ఫ్యామిలీ డ్రామాను ఇంకెంత కాలం సాగదీస్తారనే పెదవి విరుపులు కూడా నెట్టింట గట్టిగానే వినిపిస్తున్నాయి. ఒకే మర్డర్ కేసు చుట్టూ మూడు భాగాలు తీయడం మామూలు విషయం కాదు. ఫస్ట్ పార్ట్ మంచి ట్విస్ట్ తో ఆకట్టుకుంటే, రెండో భాగం ఎమోషన్స్ తో అంతకుమించి కనెక్ట్ అయింది. ఇక మూడో భాగానికి జనాలు థియేటర్లకు వెళ్లారంటే దానికి ప్రధాన కారణం జార్జ్ కుట్టీ క్యారెక్టర్ పై ఉన్న అభిమానమే. కానీ ఒకే కేసు చుట్టూ అవే ఎంక్వయిరీలు మళ్లీ మళ్లీ చూస్తుంటే ఆడియన్స్ కు విసుగు రావడం చాలా సహజం. ఆ క్యారెక్టర్ పై ఉన్న క్రేజ్ క్లిక్కయ్యిందా లేక జనాల్లో ఆసక్తి తగ్గిపోయిందా అనేది ముందు ముందు తేలనుంది. ఇక్కడే ఓపెన్ ఎండింగ్ లాజిక్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. హాలీవుడ్ లో ఇలాంటి ప్రయోగాలు కొత్త కాదు. ఇన్సెప్షన్ సినిమా క్లైమాక్స్ ను కావాలనే ఒక పజిల్‌లా వదిలేశారు. దానివల్ల ఆ ప్రాజెక్ట్ పై పదేళ్ల తర్వాత కూడా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. జీతూ జోసెఫ్ కూడా ఇదే ఫార్ములాను ఇక్కడ వాడినట్లు తెలుస్తోంది. సినిమాకు ఎండ్ కార్డు వేయకపోవడం వల్ల థియేటర్ల బయట కూడా ఆ కథ మీద జోరుగా చర్చలు నడుస్తున్నాయి. తర్వాత ఏమవుతుందనే ఈ క్యూరియాసిటీనే సినిమాకు ఫ్రీ పబ్లిసిటీ తెచ్చిపెడుతోంది. అయితే దీనికి ఇంకో నెగిటివ్ యాంగిల్ కూడా ఉంది. కథను లాజికల్ గా పూర్తి చేయలేకే దర్శకుడు మధ్యలో వదిలేశాడనే విమర్శలు వస్తున్నాయి. నాలుగో భాగం కోసం తన దగ్గర ప్రస్తుతం ఎలాంటి స్టోరీ లైన్ లేదని జీతూ గతంలోనే చెప్పాడు. అలాంటప్పుడు మూడో భాగంతోనే ఈ సిరీస్ కు ముగింపు ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్న లాజికల్ గానే అనిపిస్తుంది. ఒక వర్గం ఈ సస్పెన్స్ ను బాగా ఎంజాయ్ చేస్తుంటే, మరో వర్గం మాత్రం కథను గౌరవంగా ముగించేయాలని కోరుకుంటోంది.

# తమన్ జేబులో ఎనిమిది సినిమాలు

ఈ మధ్య తమన్ సౌండ్ కొంచెం తగ్గిపోయింది. తన నుంచి సాలిడ్ బ్లాక్ బస్టర్ పడక అభిమానులు ఎదురు చూస్తున్నారు. అయితే రాబోయే అయిదారు నెలల్లో తమన్ తుపాకీ నుంచి ఒకటి రెండు కాదు ఏకంగా అయిదు పవర్ ఫుల్ బుల్లెట్లు దిగబోతున్నాయి. తన ఓజి కన్సర్ట్ విశేషాలను పంచుకోవడానికి మీడియాను కలుసుకున్న ఈ మ్యూజిక్ సెన్సేషన్ తన రాబోయే ప్రాజెక్టుల గురించి ఇచ్చిన ఎలివేషన్స్ చూస్తే అంచనాలు పెరిగిపోయేలా ఉన్నాయి. అవేంటో చూద్దాం. మొదటిది బాలయ్య 111. వీరసింహారెడ్డి కాంబోని రీయట్ చేస్తూ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ టీజర్ జూన్ 10 రానుంది. దసరాకి సినిమా విడుదల కావొచ్చని ఫిలిం నగర్ టాక్. ఇది ష్యూర్ షాట్ బ్లాక్ బస్టరని తమన్ హామీ ఇస్తున్నాడు. క్యాస్టింగ్ లో స్టార్స్ లేకపోయినా 'ఇట్లు అర్జున' కూడా అదే కోవలోకి చేరే నమ్మకాన్ని కలిగిస్తున్నాడు. వెంకటేష్ 'ఆదర్శ కుటుంబం' ఎన్ని రోజులు ఆడుతుందో చెప్పలేనంత గొప్ప ఫన్ తో వస్తోందని ఊరించాడు. వీటికన్నా ముందు విడుదలయ్యే 'లెనిన్' ఖచ్చితంగా అఖిల్ కెరీర్ బెస్ట్ అవుతుందనే కాన్ఫిడెన్స్ ని అక్కినేని ఫ్యాన్స్ కి ఇచ్చాడు. మెగాస్టార్ 158 గురించి చెబుతూ ఇది నెక్స్ట్ లెవెల్ అంటూ ప్రత్యేక ఎలివేషన్ ఇచ్చాడు. ఒక కమర్షియల్ సబ్జెక్టు దొరికితే చిరంజీవికి బెస్ట్ ఇస్తానని చెప్పిన తమన్ కు ఆ మాట నిలబెట్టుకునే టైం వచ్చింది. స్టేజి మీద చెప్పింది ఇవే అయినా తమన్ ఖాతాలో వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు, తమిళ మూవీ ఇదయం మురళి, సందీప్ కిషన్ సిగ్మా కూడా ఉన్నాయి. మొత్తానికి ఎనిమిది సినిమాలతో తమన్ పలకరింపు ఓ రేంజ్ లో ఉండబోతోంది. ఇంత బిజీగా ఉన్న సంగీత దర్శకుల్లో అనిరుద్ రవిచందర్, తమన్ నువ్వా నేనా అనే రేంజ్ లో పోటీ పడుతున్నారు.



దేవిశ్రీ ప్రసాద్ ఎంపిక లిమిటెడ్ గానే ఉంది. పైగా హీరో కూడా అయ్యాడు. రవి బస్రూర్ కౌంట్ పెద్దదే ఉంది కానీ డ్రాగన్ వచ్చే దాకా తన బెస్ట్ కోసం ఎదురు చూడాల్సిందే. ఇక తమన్ పైన చెప్పిన వాటిలో నాలుగైదు ఛార్ట్ బస్టర్స్ కొట్టినా చాలు తిరిగి టాప్ కు వచ్చినట్టే.



# బిజినెస్ న్యూస్




## భారీ నష్టాల్లో సూచీలు: సెన్సెక్స్ 719, నిఫ్టీ 244 పాయింట్లు డౌన్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకోవడం, చమురు ధరలు పెరగడం, అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న అంచనాలు ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్‌నూ పడేశాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్లు నష్టపోగా.. మధ్యలో కోలుకున్నట్లు కనిపించింది. ఆఖరిలో మళ్లీ అమ్మకాల ఒత్తిడితో 700 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 73,421.61 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,243.34) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టల్లో కదలాడింది. ఇంట్రాడేలో 73,318.94 - 73,934.35 మధ్య చలించిన సూచీ.. చివరికి 719.08 పాయింట్ల నష్టంతో 73,524.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 243.70 పాయింట్ల నష్టంతో 23,123 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ట్రెంట్, ఇండిగో, రిలయన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 96.95 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4290 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. కారణాలు ఇవీ.. పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ పరస్పర దాడులు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ఆసియా మార్కెట్‌లు దాదాపు నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్‌లూ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మరోసారి ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. 93 డాలర్ల వద్ద ట్రేడవుతున్న క్రూడాయిల్ 96 డాలర్ల స్థాయికి చేరడం మన మార్కెట్‌లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

## త్వరలోనే రూ.10,000 కోట్ల జెప్టో ఐపీఓ!




క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సవరించిన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి ఈ వారంలోనే సమర్పించే అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. ఆదిత్ పలీచా నేతృత్వంలోని ఈ కంపెనీ పత్రాలు సమర్పించిన తర్వాత ఇన్వెస్టర్ రోడ్‌షోలను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఈ నెలాఖరున లేదంటే జులైలో ఐపీఓ ఉండొచ్చని సమాచారం. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.10,000 కోట్లకు పైగా నిధులు సమీకరించాలని జెప్టో భావిస్తోంది. ఈ సంస్థ త్రైమాసిక నికర ఆర్డరు విలువ (ఎన్‌ఓవీ) 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9,500 కోట్ల)ను అధిగమించింది. 2021లో ఆదిత్ పలీచా, కైవల్య వోహ్రా జెప్టోను స్థాపించారు.దేశంలో అతి పెద్ద క్విక్ కామర్స్ కంపెనీల్లో ఒకటిగా అత్యంత వేగంగా ఎదిగింది. తొలుత గత డిసెంబరులో కాన్ఫిడెన్షియల్ పద్ధతిలో ఐపీఓ ముసాయిదా పత్రాలను కంపెనీ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సెబీ అడిగిన మరిన్ని అంశాలు జోడించి పత్రాలు సమర్పించబోతోంది.

## 'టెక్ స్టాక్స్ అమ్మకాల్లో ఉంటే కొనుక్కోండి..

### ఇదే మంచి సమయం': హువాంగ్



కృత్రిమ మేధ రంగంలో ప్రస్తుత షేర్ల పతనం వాస్తవానికి మంచి వార్తేనని ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ అంటున్నారు ). ఏఐ నిర్మాణం ఇప్పుడే మొదలైందని, టెక్‌స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిలో ఉన్నప్పుడే కొనుగోలుకు మంచి సమయం అని వ్యాఖ్యానించారు. ఎన్విడియా సహా పలు చిప్ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూస్తోన్న సమయంలో హువాంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమమేధ (ఏఐ) సంస్థల విలువలపై మదుపర్లకు సందేహాలు ఏర్పడటం, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను పెంచొచ్చన్న ఆందోళనలు ఈ నష్టాలకు దారితీశాయి. ఏఐ పెట్టుబడులను మదుపర్లు భారీగా వెనక్కి తీసుకోవడంతో దక్షిణకొరియా సూచీ కొస్పి పతనమైంది. ఈ షేర్ల అమ్మకాలను ఎలా చూడాలంటూ ఆ దేశంలోనే ఉన్న హువాంగ్‌కు ప్రశ్న ఎదురైంది. "కృత్రిమ మేధ మొదలైంది ఇప్పుడే. ఇప్పుడు మీరు డిస్కౌంట్‌లో స్టాక్స్ కొనుగోలు చేయడానికి మంచి సమయం. ఉత్సాహంగా ఉండాలి. ఇంటర్నెట్ ఎలాగైతే ఇప్పుడు ప్రజల జీవితాల్లో అత్యంత కీలకంగా ఉందో.. ఏఐ కూడా అలాగే మారడం ఖాయం" అని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఏఐ పలు రంగాల్లోకి విస్తృత మార్పులు తీసుకువస్తుందని, ప్రజల జీవన విధానాన్ని మారుస్తుందని హువాంగ్ విశ్వసిస్తున్నారు. ఆ ఏఐ సర్వీసుల్ని అందించాలంటే డేటా సెంటర్లు, చిప్స్ కీలకం. ప్రస్తుత కృత్రిమ మేధ యుగంలో డేటా సెంటర్లకు అత్యాధునిక చిప్‌లను అందిస్తూ ఎన్విడియా ప్రపంచంలోనే అగ్రగామి సంస్థగా కొనసాగుతోంది.

## HDFC బ్యాంక్ అలర్ట్: EMI కస్టమర్లకు షాక్!




దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (ఎణఖీజ దీఖఅ) తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (వీజూ=)ను పలు కాలపరిమితులపై 5 నుంచి 10 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. కొత్త రేట్లు జూన్ 8, 2026 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారిత గృహ, వ్యక్తిగత, వాహన రుణాలు తీసుకున్న కొందరు కస్టమర్లకు భవిష్యత్తులో ఈఎంఐలు పెరిగే అవకాశం ఉంది.

ఆర్బీఐ రెపో రేటు స్థిరంగానే.. అయినా పెంపు ఎందుకు?

గత వారం జరిగిన ద్రవ్య విధాన సమీక్షలో ఆర్బీఐ రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది. అయితే బ్యాంకుల నిధుల సమీకరణ వ్యయం, డిపాజిట్ ఖర్చులు, మార్కెట్ పరిస్థితులు వంటి అంశాల ఆధారంగా ఎంసీఎల్ఆర్‌ను బ్యాంకులు స్వతంత్రంగా నిర్ణయిస్తాయి. అందుకే రెపో రేటులో మార్పు లేకపోయినా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన అంతర్గత బెంచ్‌మార్క్ రేట్లను సవరించింది.

ఏయే కాలపరిమితుల్లో ఎంత పెరిగింది?

సవరించిన ఎంసీఎల్ఆర్ రేట్ల ప్రకారం ఓవర్‌నైట్ రేటు 8.05 శాతం నుంచి 8.10 శాతానికి పెరిగింది. మూడు నెలల ఎంసీఎల్ఆర్ 8.15 శాతం నుంచి 8.20 శాతానికి, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.30 శాతం నుంచి 8.35 శాతానికి చేరింది.

రిటైల్ రుణాలకు కీలక బెంచ్‌మార్క్‌గా భావించే ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ 8.35 శాతం నుంచి 8.40 శాతానికి పెరిగింది. రెండేళ్ల ఎంసీఎల్ఆర్‌లో అత్యధికంగా 10 బేసిస్ పాయింట్ల పెంపు చోటుచేసుకుని 8.45 శాతం నుంచి 8.55 శాతానికి చేరగా, మూడేళ్ల ఎంసీఎల్ఆర్ 8.60 శాతం నుంచి 8.65 శాతానికి పెరిగింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ మాత్రం 8.05 శాతం వద్ద యథాతథంగా కొనసాగింది.

తాజా ఎంసీఎల్ఆర్ రేట్లు

ఓవర్‌నైట్ -- 8.10%
1 నెల -- 8.05%
3 నెలలు -- 8.20%
6 నెలలు -- 8.35%
1 సంవత్సరం -- 8.40%
2 సంవత్సరాలు -- 8.55%
3 సంవత్సరాలు -- 8.65%

ఈఎంఐలు వెంటనే పెరుగుతాయా?

అలా ఏం లేదు. ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమైన రుణాల్లో వడ్డీ రేటు ప్రతి నెల, త్రైమాసికం లేదా వార్షిక రీసెట్ తేదీకి అనుగుణంగా మారుతుంది. కాబట్టి మీ రుణ ఖాతాకు తదుపరి రీసెట్ తేదీ వచ్చినప్పుడు మాత్రమే కొత్త ఎంసీఎల్ఆర్ ప్రభావం కనిపిస్తుంది. ఈఎంఐ పెరగవచ్చు లేదా రుణ కాలపరిమితి పొడిగించవచ్చు. ఇది రుణ ఒప్పంద నిబంధనలపై ఆధారపడి ఉంటుంది.

అసలేమిటీ ఎంసీఎల్ఆర్?

ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్) అనేది బ్యాంకు రుణాలను ఇవ్వగల కనీస వడ్డీ రేటు. 2016లో ఆర్బీఐ ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. బ్యాంకు నిధుల వ్యయం, నిర్వహణ ఖర్చులు, నగదు నిల్వల వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని దీనిని నిర్ణయిస్తారు. అనేక పాత గృహ, వ్యక్తిగత, వాహన రుణాలు ఇప్పటికీ ఎంసీఎల్ఆర్ ఆధారంగానే కొనసాగుతున్నాయి. బేస్ రేట్, బీపీఎల్ఆర్ యథాతథం

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బేస్ రేట్ ప్రస్తుతం 8.80 శాతంగా కొనసాగుతోంది. అలాగే బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేట్ ( 17.30 శాతంగా ఉంది. ఈ రేట్లు డిసెంబర్ 26, 2025 నుంచి అమల్లో ఉన్నాయి.

రుణగ్రహీతలు ఏం చేయాలి?

మీ హోమ్ లోన్ లేదా ఇతర రుణం ఎంసీఎల్ఆర్ ఆధారితమా, లేక జుదీూ=/రెపో-లింక్డ్ విధానంలో ఉందా అనేది ఒకసారి చెక్ చేసుకోవడం మంచిది.

# విద్యార్థుల స్వీయరక్షణకు కరాటే దోహదపడుతుంది



భీమునిపట్నం జూన్ 08 నేటి మనదేశమ్ : విద్యార్థుల క్రమశిక్షణకు, మానసిక స్థైర్యానికి, స్వీయరక్షణకు క్రీడలు దోహదపడతాయని టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి, రెమో లయన్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. రెమో లయన్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఫౌండర్, కోచ్ రెమో యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే ఉచిత వేసవి శిబిరాల ముగింపు కార్యక్రమానికి గంటా నూకరాజు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ క్రీడలు వ్యక్తి వికాసానికి, నైపుణ్యాభివృద్ధికి విశేషంగా ఉపయోగపడతాయని అన్నారు. క్రీడలలో నైపుణ్యం ఉన్న విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధిలో మెరుగైన అవకాశాలు ఉంటాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కొలువులో ప్రత్యేకంగా క్రీడలకు సంబంధించి రిజర్వేషన్ కేటగిరీలను అమలు చేయడం జరుగుతుందని అన్నారు. భీమిలి మరియు చుట్టుప్రక్కల ఉండే పరిసర ప్రాంతాల్లో విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వేసవి శిబిరాలను ఏర్పాటు చేసి వాటిని విజయవంతం చేయడం అంత ఆషామాషి కాదని అన్నారు. దానిని విజయవంతం చేయడానికి విశేష కృషి చేసిన కోచ్ రెమో యాదవ్ కి నాయొక్క అభినందనలు అని గంటా నూకరాజు అన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు వరహాలు మాట్లాడుతూ ప్రతీ ఏడాది వేసవిని దృష్టిలో పెట్టుకొని స్థానిక విద్యార్థులకు అనేక ప్రాంతాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. దీనికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదములు అని అన్నారు. కోచ్ రెమో యాదవ్ మాట్లాడుతూ మే 27వ తారీకున ప్రారంభం అయిన వేసవి శిబిరం జూన్ 7వ తారీకుతో ముగిసిందని అన్నారు. భీమిలి ఎన్టీఆర్ మినీ స్టేడియం, సిదార్ పాఠశాల, తగరపువలస, కోరాడపేట, సంగివలస తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు గ్రేడింగ్ బెల్ట్ లు మరియు శిబి రంలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్ లు ముఖ్య అతిధులుగా విచ్చేసిన గంటా నూకరాజు, అసోసియేషన్ అధ్యక్షులు వరహాలు, ఉపాధ్యక్షులు రమణ, మాజీ కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, మణికంఠ స్వీట్స్ నాగరాజు, శ్రీను ఆప్టికల్స్ శ్రీను తదితరుల అందజేశారు . ప్రతీ వేసవి శిబిరంలో తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించడం వలనే విజయవంతం అయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ పెద్దలు ముఖ్య అతిధులకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విశేష కృషి చేసిన రెమో యాదవ్ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ నాయుడు, ప్రకాష్, శివ, చరణ్ లు పాల్గొన్నారు.

# వీఆర్వో ఆత్మహత్యకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి



గిద్దలూరు, జూన్ 08 నేటి మనదేశమ్ : కర్నూలు జిల్లాలో పని ఒత్తిడి తాళలేక గ్రామ రెవెన్యూ అధికారి మహమ్మద్ హుస్సేన్ ఆత్మహత్యకు పాల్ప డటం అత్యంత విచారకరమని, ఆయన మృతికి కారణమైన వారిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మార్కాపురం జిల్లా అధ్యక్షుడు వై.పి. రంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం గిద్దలూరు తహసీల్దార్ కార్యా లయం వెలుపల వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మృతి చెందిన హుస్సేన్ కుటుం బానికి న్యాయం చేయాలంటూ ఈ సందర్భంగా ఉద్యోగులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ నిరసనను ఉద్దేశించి వై.పి. రంగయ్య మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి రోజురోజుకూ మితి మీరిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన మహమ్మద్ హుస్సేన్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దారుణ సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించా లన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ సహాయకుల పై ఉన్న అదనపు పని భారాన్ని తగ్గించాలని, ఇందుకు గాను 'సింగిల్ లైన్ మానిటరింగ్ సిస్టమ్'ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ...

గామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల వెంకటరామయ్య, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్, వీఆర్వోల సంఘం నాయకులు బిజ్జం రాజశేఖర్ రెడ్డి, డి అచ్చయ్య, పప్పుల కొండయ్య, ఆంజనేయులు, ఖాసీంపీరా, వెంకటేశ్వర్లు, ఖాసీంవలి, సిద్దయ్య గ్రామ సర్వేయర్లు దూదేకుల ఖాజావలి, రమేష్ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, ప్రవల్లిక, శ్రీకాంత్, వెంకట్రావుతో పాటు విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల రాష్ట్ర కార్యదర్శి అంజి, సంఘం నాయకులు అల్లూరయ్య తదితరులు పాల్గొని హుస్సేన్ కుటుంబానికి తమ మద్దతును ప్రకటించారు.

# సెప్టెంబరు కల్లా చెత్త శుద్ధి పూర్తి : ఎమ్మెల్యే కాలవ



రాయదుర్గం, జూన్ 08 నేటి మనదేశమ్ : స్థానిక డంపింగ్ యార్డ్ లో చేపట్టిన చెత్తశుద్ధి ప్రక్రియ సెప్టెంబరు నాటికి పూర్తవుతుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. డంపింగ్ యార్డులో జరుగుతున్న చెత్తశుద్ధి, వ్యర్థాల నిర్వహణ పనుల ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ డంపింగ్ యార్డులో లక్ష మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, దా నిని శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధిచేసి ఎరువుగా మార్చే ప్రక్రియ కొనసా గుతోందని తెలిపారు. ఇప్పటివరకు 40 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ఎరువుగా మార్చగా, మరో 60 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేయాల్సి ఉందన్నారు. పట్టణంలో దశాబ్దాలుగా పేరుకు పోయిన చెత్తకు శాశ్వత పరిష్కారం చూపేదిశగా ప్రభు త్వం కీలక చర్యలు తీసుకుం టోందన్నారు. 63 ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తొలిసారిగా పూర్తి స్థాయిలో శుభ్రపరుస్తుండటం సంతోషక రమన్నారు. ఈ చెత్త శుద్ధి కోసం సుమా రు రూ. 8 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా పట్టణంలోని వ్య క్తిగత మరుగుదొడ్ల నుంచి సేకరించే మ లినాలను శాస్త్రీయపద్ధతిలో శుద్ధి చేసే ప్రత్యేక యూనిట్‌ను రూ. 2 కోట్లతో ఏ ర్పాటు చేసినట్లు చెప్పారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రాసెసింగ్ చేసే ఆధు నిక వ్యర్థాల నిర్వహణ యూనిట్‌ను మరో రూ. 3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశామని వివ రించారు. పట్టణ పారిశుధ్యాన్ని మెరుగుపరి చేందుకు రూ. 13 కోట్లు ఖర్చు చేస్తున్నా మన్నారు. భవిష్యత్తులో పట్టణం నుంచి వచ్చే చెత్తతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల మలినాలను కూడా ఇక్కడే శుద్ధిచేయడం ద్వారా రాయదుర్గాన్ని పరిశుభ్రమైన పట్ట ణంగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు.

# పోస్టల్ సేవలు డ్వాక్రా మహిళలకు అందజేయాలి

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గజపతినగరం, జూన్ 08 నేటి మనదేశమ్ : డ్వాక్రా మహి ళలకు రుణాలు అందించే విధంగా పోస్టల్ డిపార్ట్‌మెం ట్ సేవలు అందజేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక ఉష కన్వెన్షన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డు కార్యక్ర మానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ ద్వారా డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలు అందజేస్తుం దని.. అలాగే కేంద్ర సహకారంతో రుణాలు అందించే దిశగా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలి పారు. అనంతరం మండలంలోని లోగిస గ్రామానికి చెందిన తలుపుల తులసి కుటుంబానికి రూ.50లక్షల చెక్కును అందజేశారు. గతంలో ఏడాదికి రూ.2600 ప్రీమియం చెల్లించి ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబానికి ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుంద న్నారు. అనం తరం పొదుపు పథకాలను ఉపయోగిస్తు న్న ఉత్తమ ఖాతాదారులకు పాస్ పుస్తకాలను అందజే శారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి మెమోంటోలు అందజేశారు.

# బలవంతపు భూ సేకరణ ఆపాలి



విజయనగరం, జూన్ 08 నేటి మన దేశమ్ : బొండపల్లి మండలం కిండాం అగ్రహారం రెవెన్యూ పరిధిలో కిండాం అగ్రహారం, రాచ కిండాం, కొండ కిండాం గ్రామాల్లో బలవంతపు భూ సేకరణ ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయా గ్రామాల ప్రజలు కలెక్టర్లకు భూ సేకరణ ఆపాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం విజయన గరం కలెక్టరేట్ ముందు ఆయా గ్రామాల రైతులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామంలో ఎం ఎం ఎస్ ఎం ఈ పార్క్ కోసం 150 ఎకరాలు తీసుకొని ఏ రకమైన పార్క్ ను నిర్మించలేదని, ఇప్పుడు మరలా ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు పేరుతో రైతుల వద్ద నుండి 175 ఎకరాల భూమిని కాజేసీ రియల్ ఎస్టేట్ లకు అప్పజెప్పాలని చూస్తున్నారని ఆరోపించారు. కేవలం 10 సెంట్లు 20 సెంట్లు, ఆరెకరా మాత్రమే భూములు ఉన్న చిన్న,సన్నకారు రైతులను నిర్వాసితులను చేయాలని ప్రభుత్వం చూస్తుందని అన్నారు. రెవిన్యూ అధికారులు రైతులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతపు భూసేకరణ చేసేందుకు పూనుకోవడం దుర్మార్గమైన చర్యని అన్నారు. రైతులపై బెదిరింపులు ఆపి ఎం ఎం ఎస్ ఎం ఈ పార్కు కోసం ఇచ్చిన భూముల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు నిర్మిస్తే సరిపోతుందని అన్నారు. దానికి రైతులు అడ్డు తగలరని తెలిపారు. ఇప్పటికే వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం జిల్లాలో తీసుకున్న భూముల్లో ఏ రకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, జిల్లాలో భూములు తీసుకున్న భోగాపురం ఎయిర్పోర్ట్, జిందాల్ తదితర చోట్ల ప్రజలకు ఏ రకమైన ఉపాధిని చూపలేదని అన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ కలుగజేసుకొని రైతులు బలవంతపు భూసేకరణను నిలిపివేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ గోపాలం, బి.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై స్పీడ్ నియంత్రణ బోర్డులు ఏర్పాటు



రాజమహేంద్రవరం, జూన్ 08 నేటి మనదేశమ్ : తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు సోమవారం లాలాచెరువు సెంటర్ వద్ద స్పీడ్ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేశారు. హైవే లాలా చెరువు సెంటర్ వద్ద వాహనాలు అతివేగంతో వస్తున్నాయని దీనిని నియంత్రించేం దుకు ఎస్పీ ఆదేశాలతో బోర్డులు ఏర్పాటు చేయడం జరుగు తుందని ట్రాఫిక్ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు. అబ్దుల్ నబీ, ఎ.శంకర్ , ఎస్ఐలు సత్య నారాయణ, శ్రీనివాసరావు, గౌతమి, శివాజీ ,సత్యనారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడా కోటాతో ఉద్యోగాలు

## తైక్వాండో పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం, జూన్ 08 నేటి మనదేశమ్ : క్రీడా కోటా వల్ల ఉద్యోగాలు వచ్చే అవ కాశం ఉంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. స్థానిక ఏడు రోడ్ల జంక్షన్‌లో సమ్మర్ తైక్వాండో లీగ్ 2006 సబ్ జూనియర్స్, క్యాడిట్, జూనియర్, సీని యర్ విభాగా లకు సంబం ధించి జిల్లాస్థాయి పోటీల ముగింపు కార్య క్రమంలో విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు. కాగా జిల్లా నలుమూలల నుంచి వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు క్రీడాకారులు ప్రతిభను కనబరిచారు. ఈ పోటీలు ఆదివారం రాత్రి వరకు సాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సహిస్తూ క్రీడా కోటాను పెంచిందని, తద్వారా ఎందరో క్రీడా కారులకు ప్రభుత్వ ఉద్యో గాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం, టీడీపీ నాయ కులు పాండ్రంకి శంకర్, వైసీపీ నాయకులు శిమ్మ రాజశేఖర్, మండవల్లి రవి, ఉన్న నాగరాజు, దళిత జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంఠ వేణు, వివిధ సంఘ నాయకులు చౌదరి పురషో త్తమనా యుడు, మెట్ట నాగరాజు, నౌపడ విజయ్‌కుమార్, సుధీర్ వర్మ పాల్గొన్నారు.

# నవ్వుతూ జీవించండి ఆరోగ్యంగా ఉండండి




విశాఖపట్నం జూన్ 08 నేటి మనదేశమ్ :ముఖంలో ఉండేట టువంటి నవ్వు కవళికలే మనిషి ఆరోగ్యంగా ఉన్నాడు అనడానికి సూచిక అని ప్రముఖ సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి పేర్కొన్నారు. సాయంత్రం పౌర గ్రంథా లయంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో నెలవారి నవ్వుల కార్యక్రమాల్లో భాగంగా వివిధ హాస్య లఘు నాటికలను ప్రదర్శిం చారు. క్లబ్ వ్యవ స్థాపకులు ఎం వి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జబర్దస్త్ ప్రకాష్ నిర్వహణలో కడుపుబ్బా నవ్వించే హాస్య సన్నివేశాలను ప్రదర్శించి ప్రేక్షకుల హర్షధ్వానాల అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన సన్ మూర్తి మాట్లాడుతూ క్రమం తప్పకుండా కార్యక్రమాన్ని ప్రతి నెల నిర్వహిస్తూ అటు కళాకారులకు ఇటు కళా ప్రియులకు హాస్యాన్ని పండిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వేసవి వినోదంగా చేపట్టే ఈ కార్యక్రమాలకు ప్రేక్షక ఆదరణ విశేషంగా ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సినీ నటులు రచయిత స్వర్గీయ కాశీ విశ్వనాథ్ సతీమణి మహాలక్ష్మి వారి తనయుడు శ్రీధర్, ఆంధ్ర యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం ప్రొఫెసర్ మీగడ శశిభూషణ్, టాక్స్ కన్సల్టెంట్ తిలక్ పట్నాయక్, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా...

ప్రదర్శించిన స్కిట్స్ లో ఎం వి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, న క్షత్ర , సూర్య మద్రాపు, బోను నరసింహారావు పాల్గొన్నారు. ముందుగా శ్రీ. కళా రాధన,మ్యూజిక్ మరియు డాన్స్ అకాడమి గాజువాక తాళ్లపాక సందీప్ కుమార్ శిష్య బృందం. రోషిత. తనీషా. నివేదిత. నిహారిక. మోనిషా రెడ్డి. జాస్మిత. అక్షయ. షణ్ముఖ ప్రియులు శాస్త్రీయ నాట్య ప్రదర్శన చేసిన అనంతరం.పార్టీ. హోటల్. నోములు. ఆఫీస్ వాతావరణం. పెద్దాయనని పిలు. రాసిన నవల. యాత్రలు. పే లుడు పథర్థాలు. షాపింగ్. చెప్పులు. ప్రదర్శించి మెప్పించారు. ప్రదర్శకులను మెమొంటోలతో సత్కరించారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఐదుగురు అరెస్ట్..

బిట్రగుంట(ప్రకాశం) : కె.బిట్రగుంట గ్రామంలోని ఒక పేకాట స్థావరంపై జరుగుమల్లి ఎస్సై భాగ్యరాజ్ తన సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 14,030 నగదుతో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై భాగ్యరాజ్ మాట్లాడుతూ.. జరుగుమల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట, క్రికెట్ బెట్టింగ్, గంజాయి రవాణా వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. పదేపదే నేరాలకు పాల్పడే వారిపై సస్పెక్ట్ షీట్లు తెరిచి ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ప్రజల ప్రాంతాల్లో ఇలాంటి అసాంఘిక పనులు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, గోప్యంగా ఉంచుతామన్నారు.

## మచిలీపట్నంలో వైఎస్సార్సీపీ నిరసన కార్యక్రమం

**మచిలీపట్నం జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త పేర్ని కిట్టు ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల పత్రాలను పార్టీ శ్రేణులు దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ, బూటకపు హామీలు, అసత్య ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి సంక్షేమ కార్యక్రమాలను పక్కన పెట్టిందని విమర్శించారు. అబద్ధాలు, మోసాలనే రెండు స్తంభాలుగా చేసుకుని ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, అయినప్పటికీ వాటిని సూపర్ హిట్‌గా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. మెగా డీఎస్సీ నియామకాల విషయంలో అర్హులైన అభ్యర్థులకు అన్యాయం చేసి, కూటమికి చెందిన వారికి ప్రాధాన్యం కల్పించారని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



**బలిజిపేటజూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెదపెంకి గ్రామంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ రామచంద్రరావు కోరారు. సోమవారం మధ్యాహ్నం ఆయన అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ గ్రామంలో ఈనెల 24న పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులు ఆ తేదీ కంటే ముందుగానే పూర్తి చేసేందుకు బాధ్యులంతా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఎలాంటి ఆటంకాలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, అభివృద్ధి చేసే విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అనంతరం పలు వీధుల్లో నిర్వహిస్తున్న కాలువలు, సిమెంటు రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఎల్పీవో నాగభూషణరావు, ఎంపీడీవో వాణిశ్రీ, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

## ప్రధాన కూడళ్లు, డివైడర్ల సుందరీకరణకు భూమి పూజ



**రాయచోటి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కూడళ్లు, డివైడర్లను ఆధునిక పద్ధతిలో అందంగా తీర్చిదిద్దేందుకు సుందరీకరణ పనులకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి పాల్గొని పనులను ప్రారంభించారు. పట్టణాన్ని మరింత అందంగా మార్చేందుకు ఈ చర్యలు చేపట్టామని, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌కు వచ్చి పురుగుల మందు తాగిన యువతి




**గుంటూరు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గ్రీవెన్స్‌కు వచ్చిన ఓ యువతి అక్కడే పురుగుల మందు తాగింది. ఈ ఘటన గుంటూరు కలెక్టరేట్‌లో చోటు చేసుకుంది. తండ్రి, బాబాయ్, ఇతర కుటుంబ సభ్యులు తన తల్లిని, తనను వేధిస్తున్నారని యువతి ఆరోపించింది. 15 సవర్ల బంగారం, రూ.5 లక్షలు తీసుకుని ఇంటి నుంచి పంపించారని ఆవేదన వ్యక్తం చేసింది. తన తండ్రి రెండో పెళ్లి చేసుకున్నారని, తమని పట్టించుకోకుండా మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించింది. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ.. పోలీసులు పట్టించుకోవట్లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ పురుగుల మందు తాగింది. అక్కడున్న అధికారులు వెంటనే స్పందించి ఆమెను ఆస్పత్రికి తరలించారు.

## దళిత డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చెయ్యాలి



**భీమవరం జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భీమవరం కలెక్టరేట్ వద్ద సోమవారం దళితులు వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నం ఏడుకొండల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దళితులకు దక్కాల్సిన డీఎస్సీ పోస్టులను స్పోర్ట్స్ కోటా పేరుతో జనరల్ అభ్యర్థులకు అక్రమంగా కట్టబెట్టడం అన్యాయమని, దళిత డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## పొదుపుపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

**మచిలీపట్నం జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర వ్యాప్తంగా వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఇళ్లలో, వ్యాపార సంస్థల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఎయిర్ కండిషనర్లు ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్‌పై భారం పెరిగి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడటంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, పేలిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచిస్తున్నారు. విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుత్ భారం తగ్గడంతో పాటు నిరంతరాయ సరఫరా సాధ్యమవుతుందని తెలిపారు. అధికారులు విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం అవసరం లేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయాలని, ఏసీని 24 నుంచి 26 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వినియోగించాలని సూచించారు. అలాగే లో వోల్టేజ్ సమస్యలు ఉన్నప్పుడు భారీ విద్యుత్ పరికరాలను ఉపయోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పవర్ కట్ సమయంలో విద్యుత్ పరికరాలను స్విచ్ ఆఫ్ చేయడం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు కూడా తమ వంతు బాధ్యతగా విద్యుత్‌ను ఆదా చేయాలని, అవసరం మేరకే వినియోగించాలని అధికారులు కోరారు. ప్రజల సహకారంతో విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి తగ్గి అందరికీ మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. వేసవి కాలంలో విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

## కర్నూల్ జిల్లా వి ఆర్ ఒ మృతి -బొబ్బిలి వి ఆర్ ఒ ల అందోళన



**బొబ్బిలి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రెవిన్యూ లొ రోజురోజుకు వి ఆర్ ఒ ల పై వత్తిడి పెరిగిపోతుందని, దాని ఫలితమే, కర్నూల్ జిల్లా లొ వి ఆర్ ఒ, ఆత్మహత్య చేసుకున్నారని, సోమవారం బొబ్బిలి వి ఆర్ ఒ లు, తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జు ధరించి, ఆందోళన చేసారు. ఈ సందర్భంగా వి ఆర్ ఒ లు మాట్లాడుతూ, మా పై అదికరులే వత్తిడి చేస్తున్నారని, అందుకు కర్నూల్ జిల్లా వి ఆర్ ఒ ఆత్మహత్య రుజువని, అన్నారు. విధులలో మాకు వర్తించని పనులను మా పై రుద్దుతూన్నారని ఈ – క్రాప్ట్, ఎన్నికల బి ఎల్ ఒ గా ఇలా ఏ పని పడితే ఆపని మా తొ చేయిస్తున్నారని, కనీసం మేము పడుతున్న వత్తిడిని కనీసం అధికారులు గమనించడం లేదని వి ఆర్ ఒ లు ఆందోళన వ్యక్తం చేస్తూ, ధర్నా చేశారు, అనంతరం తహసీల్దార్ లేకపోవడం తొ ఉప తహసీల్దార్ సుబ్బారావు కు వినతి పత్రం ఇచ్చారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ప్రజలు ఖండించాలి



**నిడదవోలు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.29లు పెంచి ప్రజలకు బహుమతి ఇచ్చిందని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నిడదవోలు మండలం సింగవరంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదని రాంబాబు విమర్శించారు. భవిష్యత్తులో కూడా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచాలనే ప్రయత్నిస్తున్నట్లుగా ఉందని దీనిని ప్రజలు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి యుద్ధాన్ని సాకుగా చూపి ప్రజలపై కక్ష తీర్చుకుంటూ దేశంలోని బడా కార్పోరేట్లకు లాభాలు చేకూరుస్తూ లొంగుబాటు ప్రదర్శిస్తుందన్నారు. ఈ నెల 9న జరిగే రాస్తారోకో కార్యమాలను జయప్రదం చెయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు




**.కొండూరు, జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు మైలవరం సీఐ కిశోర్ బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ఎ.కొండూరు పోలీసు స్టేషన్‌లో వెల్లడించారు. మండల పరిధిలోని మత్రియా తండాకు చెందిన ధారావతు.శ్రీరాములు, విస్సన్నపేట మండలం చంద్రుపట్ల తండాకు చెందిన నాగమణిని 2007లో వివాహం చేసుకోగా వీరికి ముగ్గురు సంతానం. ఈ క్రమంలో శ్రీరాములు తన భార్యపై అనుమానం పెంచుకొని, తన అక్క భర్త అయిన ధారావతు.లోకేశ్‌తో అక్రమ సంబంధం కొనసాగిస్తోందంటూ ప్రతి రోజు గొడవపడి చిత్రహింసలకు గురి చేసేవాడు. దీంతో అతని అడ్డు తొలగించుకోవాలని నాగమణి నిర్ణయించుకొని తన సోదరుడు కొర్రా.మనోహర్ బాబు, బావ ధారావతు.లోకేశ్, అతని కుమారుడు సుమన్‌లతో కలిసి పథకం మేరకు ఈ నెల 5న శ్రీరాములుకు పూటుగా మద్యం తాగించి దిడ్డుతో ముఖంపై అదిమి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. తర్వాత శ్రీరాములకు అధికంగా మద్యం తాగే అలవాటు ఉందని, మద్యం ఎక్కువై గుండెపోటుతో మరణించాడని గ్రామస్థులను నమ్మించే ప్రయత్నం చేశారు. అయితే కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేసే సమయంలో మృతదేహంపై గాయాలు, చెవులు, ముక్కుల నుంచి రక్తం రావడం గమనించి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై వారు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి సీఐ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. మృతుడి భార్యతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి తిరువూరులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితులను నూజివీడు ఉపకారాగారానికి తరలించినట్లు ఎస్సై గంధం.మహాలక్ష్మణుడు తెలిపారు.

## ఆముదార్లంకలో పోలీసుల కార్డన్ సెర్చ్



**చల్లపల్లి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చల్లపల్లి మండలం ఆముదార్లంక గ్రామంలో సోమవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు, అవనిగడ్డ డీఎస్పీ అభిషేక్ పర్యవేక్షణలో చల్లపల్లి సీఐ కె. ఈశ్వరరావు నేతృత్వంలో 60 మంది పోలీసుల బృందం గ్రామంలో విస్తృత తనిఖీలు చేపట్టింది. తనిఖీల్లో భాగంగా సరైన ధృవీకరణ పత్రాలు చూపించలేని నాలుగు ట్రాక్టర్లను, 18 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## వైయస్ఆర్ సీపీ నేతల కీలక చర్చలు: పార్టీ బలోపేతంపై దృష్టి



**భీమవరం జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పశ్చిమ గోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం భీమవరంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ అధ్యక్షతన జరిగింది. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, తణుకు నియోజకవర్గ పరిశీలకులు కొట్టు నాగుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న కార్యక్రమాల నిర్వహణ, కార్యకర్తల సమన్వయం వంటి అంశాలపై చర్చించారు.

## అర్జీదారులు సంతృప్తి పొందేలా ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి.

### జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్.




**శ్రీకాకుళం, జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందే విధంగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్. గారు సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి జిల్లా ఎస్పీ స్వయంగా 45 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారుతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు. అనంతరం సంబంధిత ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర ప్రత్యేక అవసరాలు కలిగిన అర్జీదారులతో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో మొత్తం 45 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, మోసపూరిత వ్యవహారాలు, సైబర్ నేరాలు, సివిల్ తగాదాలు మరియు ఇతర వివిధ అంశాలకు సంబంధించిన వినతులు ఉన్నాయి.

## డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వస్తే జైలుకే: సీఐ గంగాధర్



**ఆత్మకూరు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** డివిజన్‌లో గంజాయి, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక డ్రగ్స్ టెస్టింగ్ కిట్లతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు సీఐ గంగాధర్ తెలిపారు. డివిజన్‌కు 50 కిట్లు, ఆత్మకూరు సర్కిల్‌కు 16 కిట్లు అందాయని చెప్పారు. ఇప్పటివరకు ఏడుగురికి పరీక్షలు నిర్వహించగా నెగటివ్ వచ్చినట్లు వెల్లడించారు. పరీక్షల్లో పాజిటివ్‌గా తేలితే ప్రత్యేక విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుని జైలుకు పంపుతామని హెచ్చరించారు.

## ఎస్ ఐ ఆర్ పై శిక్షణ

### ఆర్ డి ఒ,రామ్మోహన్రావు



**బొబ్బిలి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : జిల్లా** కలెక్టర్ ఆదేశాలు మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ (SIR) లొ భాగంగా ప్రతి ఇంటిని సర్వే చేయుటకు, బి ఎల్ ఒ లకు సూపర్వైజర్లకు, నాలుగు మండలాల తహసీల్దార్ లకు, మరియు బొబ్బిలి మున్సిపల్ కమీషనర్ కు, శిక్షణ జరుగుతుందని ఆర్ డి ఒ తెలిపారు. ఈ రోజు ఉదయం 10 గంటలనుండి 12 గంటలవరకు బొబ్బిలి మండలం మధ్యాహ్నం 3 గంటలనుండి 5 గంటల వరకు రామభద్రపురం మండలం. రేపు అనగా బుధవారం ఉదయం 10 గంటలనుండి 12 గంటలవరకు బాడంగి మండలం, మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు తెర్లం మండలం, పైన తెలిపిన అన్ని మండలాలకు శిక్షణ తరగతులు, బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు జరుగుతాయని, నియోజకవర్గ ఎన్నికల ఆదికారి మరియు ఆర్ డి ఒ తెలిపారు.

## బ్బారాయుని దర్శించుకున్న కేరళ డిజిపి




**మోపిదేవి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఽరళ రాష్ట్ర డీజీపీ రవడ చంద్రశేఖర్ తన కుటుంబంతో కలిసి సోమవారం మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఘన స్వాగతం పలికి, నాగపుట్టలో పాలు పోసి, స్వామివారిని దర్శించుకుని, విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి, శాలువాలు, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com